తిరిగొద్దాం.. తెలుసుకుందాం!
• విద్యార్థులకు ఆటవిడుపుగా విహారయాత్రలు - 6లో

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 25 ఫిబ్రవరి 2025




శేష వాహనంపై ముక్కంటి వైభోగం!

అశేష భక్తజనం నడుమ మూలస్థానేశ్వరుడు శేషవాహనంపై కొలువుదీరి కనువిందైన దర్శనం ఇచ్చాడు. నగరంలోని మూలాపేట మూల స్థానేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు జరిగాయి. అనంతరం చప్పర ఉత్సవం జరిగింది. సాయంత్రం మూలస్థానేశ్వరస్వామి, భువనేశ్వరి అమ్మవార్లకు కుంభ హారతులు, విశేష పుష్పాలంకరణలు జరిగాయి. అనంతరం స్వామివారు శేషవాహనంపై కొలువుదీరి విహరించారు. ఈ కార్యక్రమాలను ఉభయదాతలు, ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

బర్డ్ ఫ్లూ... భయమేదీ!?

• కోళ్ల ఫారాలలో కానరాని జాగ్రత్తలు • దుర్వాసన, ఈగల బెడదతో ప్రజలు



మర్రిపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగురాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ విజృంభిస్తోంది. వ్యాధి దాటికి వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తుండటంలో ప్రజలు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తున్నారు. వ్యాధికి సోకకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే వ్యాధికి కారణమయ్యే కోళ్ల ఫారాల వద్ద మాత్రం ఎలాంటి జాగ్రతలు, శుభ్రత, నిబంధనలు యజమానులు పాటిం చడం లేదు. మర్రిపాడు మండలం కృష్ణాపురం సెంటర్ సమీపంలోనూ, బ్రాహ్మణపల్లిలోని జాతీయ రహదారికి పక్కనే కోళ్ల ఫారాలు ఉన్నాయి. కోడిమాంసం దుకాణాల వద్ద తీసుకుంటున్న చిన్నపాటి జాగ్రతలు కూడా ఇక్కడ కరువ య్యాయి. దీంతో పరిసరప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫారాల్లో నెలల తరబడి పేరుకుపోయిన కోళ్ల వ్యర్థాలతో కిలోమీటరు దూరం దుర్వాసన వెదజల్లుతోంది. కోళ్లు, గుడ్లు కొనుగోలు చేసేందుకు నిత్యం ఇతర ప్రాంతాల నుంచి పౌల్ట్రీఫామ్‌లకు వ్యాపారులు వస్తుంటారు. వారు ఏయే ప్రాంతాల్లో కోళ్ల ఫామ్‌లలో తిరుగుతూ వస్తున్నారో ప్రాథమిక జాగ్రతలను సైతం పాటించకపోగా, శానిటేషన్ చర్యలు తీసుకోవడంలేదు. చుట్టూ ఈగలమోతతో పెగళ్లపాడు, బూదవాడ, కృష్ణాపురం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణాపురం బస్టాండ్ సెంటర్ ప్రాంతంలోని దుకాణాలకు వివిధ గ్రామాల నుంచి వస్తున్న ప్రజలు సైతం ఈగల బెడదతో తట్టుకోలేకపోతున్నారు. ఆ ప్రాంతంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో వందలాది మంది చదువుకుంటున్నారు. వారు కూడా దుర్వాసన, ఈగలతో ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, చర్యలకు రాజకీయ ఒత్తిళ్లు అడ్డువస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



పౌల్ట్రీ ఫామ్‌లో పేరుకుపోయిన కోళ్ల వ్యర్థాలు



ఫామ్‌లో ఉన్న కోళ్లు



బంకుల్లో బురిడీ!

• పెట్రోలు, డీజిల్ విక్రయాల్లో మాయాజాలం
• నిబంధనలకు నీళ్లొదిలిన నిర్వాహకులు
• విజిలెన్స్ తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి
• లీటరుకు 40 మి.లీ తేడా గుర్తించిన అధికారులు
• రూ.32.77 లక్షల విలువైన ఇంధనం సీజ్
• సివిల్ సప్లయిస్ శాఖపై విమర్శల వెల్లువ

నెల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బతుకుబండి నడవాలంటే అందులో పెట్రోల్, డీజిల్ అత్యవసరం. ఈ రెండు రకాల ఇంధనం లేకపోతే సాధారణ జీవనాన్ని ఊహించలేం. అటువంటి పెట్రోల్, డీజిల్ మాటున వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. పెట్రోల్ బంకుల యజమానులు నిబంధనలకు నీళ్లొదులుతూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. వీరి అక్రమాలను అరికట్టాల్సిన సివిల్ సప్లయిస్, తూనికల కొలతల శాఖలు మామూళ్ల మత్తులో ఊగుతున్నా యన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా విజిలెన్స్ విభాగం అధికారులు పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న మోసా లను బయటపెట్టేందుకు పూనుకున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులను వెంటబెట్టుకొని జిల్లావ్యాప్తంగా కొన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అనేక మోసాలు బయటపడ్డాయి. మూడు బృందాలుగా ఏర్పడిన అధికారులు ఏడు ఫిల్లింగ్ స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. అందులో నాలుగు బంకుల్లో అవకతవకలు గుర్తించారు. మూడు బంకులపై 6 (ఏ) కేసులు నమోదు చేయగా మరో బంకుపై తూనికలు, కొలతల చట్టం ప్రకారం కేసు నమో దు చేశారు. కుందుకూరులోని ఓ ఫిల్లింగ్ స్టేషన్ లో లీటర్ పెట్రోల్‌ను శాంపిల్ తీసుకొని కొలత వేయగా 40 ఎం.ఎల్ తగ్గినట్లు గుర్తించారు. బుచ్చి సమీపంలోని రేబాల వద్దనున్న మరో పెట్రోల్ బంకు, ముత్తుకూరులోని మరో బంకులో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించడం లేదని తేల్చారు. ప్రభుత్వ నిబం ధనల ప్రకారం ఒకరు ఫిల్లింగ్ స్టేషన్‌కు లైసెన్స్ పొందగా, మరొకరు ఆపరేట్ చేస్తున్నట్లు విజిలెన్స్ అధికా రులు గుర్తించారు. ప్రతి బంకులోనూ ఉచిత ఎయిర్ మిషన్లను ఉంచాల్సి ఉండగా కొన్నిచోట్ల అవి పని చేయడం లేదు. అలాగే కార్మిక శాఖకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదు. ధరలు, సైన్ బోర్డులు, ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయలేదు. కొన్ని బంకుల్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవు. మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించడం లేదు. చాలా చోట్ల పేలుడు నియమాలకు సంబంధించిచన బోర్డులు ప్రదర్శించలేదని తనిఖీల్లో గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు జరుపుతుండటంతో రూ.32.77 లక్షల విలువైన 14,503 లీటర్ల పెట్రోల్, 14,585 లీటర్ల డీజిల్, 561 లీటర్ల 2టీ ఆయిల్‌ను అధికారులు సీజ్ చేశారు.

తనిఖీలు మరిచిన అధికారులు

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు అమలుపై తనిఖీ చేయాల్సిన బాధ్యత సివిల్ సప్లయిస్ శాఖ అధికారులదే. అలానే రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహిస్తూ ఆయిల్‌లో కొలతలు సరిగ్గా ఉన్నాయా? లేదా? అన్నది తూనికలు, కొలతల శాఖ అధికా రులు పరిశీలించాల్సి ఉంది. అయితే ఈ రెండు శాఖలు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి నెలా మామూళ్లు తీసుకుంటూ పెట్రోల్ బంకులకు వెళ్లకుండానే వెళ్లినట్లుగా రికార్డుల్లో సంతకాలు చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇటీవల కొత్త పెట్రోల్ బంకులకు అనుమతులు ఇచ్చే వ్యవహారంలో జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయంలో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అయితే వారు ఈ ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోలేదన్న విమ ర్శలున్నాయి. ఇటీవల కలెక్టర్ పలువురు జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. అందులో సివిల్ సప్లయిస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కూడా ఉన్నారు. కానీ అక్కడ పనిచేస్తున్న ఓ అధికారి సదరు ఉద్యోగిని బదిలీ చేసేందుకు ఇష్టపడలేదు. పెట్రోల్ బంకుల యజమానులను మేనేజ్ చేయడంలో ఈ ఉద్యోగి దిట్ట అని, అందుకే సదరు ఉద్యోగిని పంపకుండా అంటిపెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో కీలకమైన సివిల్ సప్లయిస్ విభాగానికి గడిచిన రెండు నెలలుగా రెగ్యులర్ అధికారి లేరు. అక్కడ పనిచేస్తున్న అధికారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం గమనార్హం.



పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

'అగ్రిగోల్డ్' ఆస్తులు అమ్మి.. డిపాజిటర్లకు చెల్లించండి

కలెక్టరేట్ ఎదుట సీపీఐ, అగ్రిగోల్డ్ బాధితుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు, అగ్రిగోల్డ్ బాధితులు

అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి డిపాజిట్‌దారులకు కూటమి ప్రభుత్వం సొమ్ము చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద డిపాజిటర్లతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నా యుడు కూడా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అయితే అది నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. వరికుంటపాడు, ఉద యగిరి, కలిగిరి, దుత్తలూరు తదితర ప్రాంతాల్లో అగ్రిగోల్డ్ భూము లు ఉన్నాయన్నారు. వాటిలో జామాయిల్, ఎర్రచందనం వంటి విలు వైన కలప ఉందని పేర్కొన్నారు. వాటిని దుండగుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్‌కు ఉన్న ఆస్తులను అమ్మకానికి పెట్టి డిపా జిటర్లను ఆదుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు ఓ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. ఈ నిరసనలో సీపీఐ జిల్లా నాయకులు దామా అంకయ్య, మాలకొండయ్య, అసోసియేషన్ నేతలు రాందాస్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేవూరు రైతులు, వైసీపీ నాయకులు

బీపీసీఎల్‌కి భూములు ఇవ్వం!

కలెక్టర్‌కు తేల్చి చెప్పిన చేవూరు గ్రామస్థులు

కందుకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి ప్రమాదకారి బీపీసీఎల్ సంస్థకు భూము లు ఇవ్వమని గుడ్లూరు మండలం చేవూరు రైతులు తేల్చి చెప్పారు. నెల్లూరులో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ ఓ ఆనంద్‌ను వారు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇండోసోల్ కంపెనీకి గ్రామస్థుల నుంచి భూములు సేకరించి ఇప్పుడు ఆ భూములు బీపీసీఎల్‌కు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నా మంటూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. 1300 ఎకరాల భూములకు కొన్ని వర్గాల రైతులకు పరిహారం కూడా అందిందన్నారు. అయితే, ఇండోసోలార్ ప్రాజెక్టు కోసం గ్రామసభలు నిర్వహించి వాతావరణ కాలుష్యం ఉండదని ఒప్పించి భూములు తీసుకున్నారని, ఇప్పుడు బీపీసీఎల్‌కు కట్టబెడితే పూర్తిగా వాతావరణం కాలుష్యమై గ్రామీన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. చేవూరు రైతులు, గ్రామస్థులతోపాటు వైసీపీ నాయకులు కిషోర్, పాశం కొండయ్య తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

శివాలయాలకు నిరంతర విద్యుత్ : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 26న జిల్లాలోని అన్ని శివాలయాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ అధికా రులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయం నుంచి ఏఈలు, ఏడీలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎక్కడా సమస్యలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే శివాలయాల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఏర్పడితే టోల్‌ఫ్రీ నెం.1912కు భక్తులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఈ సమావేశంలో ఈఈలు శ్రీధర్, శేషాద్రి బాల చంద్ర, సోమశేఖర్‌రెడ్డి, విజిలెన్సు విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

పొణకా కనకమ్మ ఆస్తులను పరిరక్షించాలి

• నెల్లూరులో కేంద్ర మహిళా వర్సిటీ ఏర్పాటు చేయాలి
• మార్చి 4న హైదరాబాద్‌లో కనకమ్మ, రామిరెడ్డి జయంత్యుత్సవాల సభ
• కనకమ్మ ఆశయ సాధన సమితి కార్యదర్శి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు పొణకా కనకమ్మ, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి జయంత్యుత్సవాలను మార్చి 4న హైదరాబాద్ అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కనకమ్మ ఆశయ సాధన సమితి ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ప్రముఖ రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పీ. వేణుగోపాలరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. కవికోకిల దువ్వూరి విజ్ఞాన సమితి, పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి ప్రతినిధులు సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకుడు సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయోద్యమ సమయంలో పొణకా కనకమ్మ కుటుంబ ఆస్తితో పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం నెలకొల్పడంతోపాటు బాలికా విద్యను ప్రోత్సహించడానికి నెల్లూరులో పాఠశాలలు, వసతి గృహాలు ఉచితంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఈనాడు ఆ ఆస్తుల విలువ రూ.2,500 కోట్లకు చేరినట్లు చెప్పారు. అయితే, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం స్వీకరించాలని కోరారు. నిస్వార్థంగా సామాజ శ్రేయస్సు కోసం నెల్లూరులోని 20 ఎకరాల విస్తీర్ణంలో కనకమ్మ నెలకొల్పిన కస్తూరిదేవి ఉచిత పాఠశాల, పారిశ్రామిక విద్యాలయం స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారుల నుంచి ఆ భూమిని కాపాడడంతో పాటు ఆ స్థలంలో కేంద్ర మహిళా విశ్వవిద్యాలయం నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరారు. పినాకిని ఆశ్రమ స్థలంలో మహిళా వర్సిటీ అనుబంధ పోస్టు గ్రాడ్యుయేషన్ కేంద్రంతోపాటు డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. మహిళా వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన నిధులను సమకూర్చడానికి పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అబిడ్స్ రెడ్డి హాస్టల్ ప్రాంగణంలో కనకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు పొణకా కనకమ్మ-జమీన్ రైతు పత్రిక స్మారక పురస్కారాన్ని సీఎం చేతుల మీదగా ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య వైబీ సత్యనారాయణ, వాడ్రేవు చినవీరభద్రుడు, విశ్రాంత ఐఏఎస్ పి.రవికుమార్, రైతు సంఘం నాయకుడు చుండూరు రంగారావును పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు ఆయన వివరించారు.



పొణకా కనకమ్మ, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి జయంత్యుత్సవ సభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పాశం యాదగిరి, కొండా లక్ష్మీకాంతరెడ్డి, ఎస్.ఎన్ రెడ్డి, సుబ్రహ్మణ్యరెడ్డి, కొల్లూరి సత్తయ్య

సాహసం చేయరా డింభకా!

నెల్లూరు నగరం రోజురోజుకు అభివృద్ధి చెందుతుండగా, అదేస్థాయిలో ట్రాఫిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయి.నగరంలో వాహనాల రాకపోకలు పెరుగుతుండగా, రోడ్డు దాటాలంటేనే చిన్నారులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా పొదలకూరు రోడ్డులోని సారా అంగడి సెంటర్‌లో విద్యార్థులు తాడు సాయంతో ఒకరినొకరు పట్టుకుని రహదారి దాటుతున్నారు. ట్రంకురోడ్డులో కూడా సూచిక బోర్డులు లేకపోవడంతో ఏక్షణాన ఏమి జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గుంపులు, గుంపులుగా రోడ్డు దాటేస్తున్నారు. ట్రాఫిక్ ఉన్న చోట్ల జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు. అలాగే రద్దీ సమయంలో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పొదలకూరు రోడ్డులో తాడు సాయంతో రోడ్డు దాటుతున్న విద్యార్థులు



వాహనాలను తప్పించుకుంటూ డివైడర్ బండలపై నుంచి రోడ్డు దాటుతున్న ప్రజలు



వాహనాల మధ్యలో రోడ్డు అవతలికి వెళుతున్న ఓ విద్యార్థిని

రిక్షా బండ్లు ఇలా...
చెత్త సేకరణ ఎలా...?



స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామ పంచాయతీల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది. ఇందుకోసం శని, ఆదివారాల్లో రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ కూడా చేపట్టింది. అయితే కలువాయి మేజర్ పంచాయతీకి గతంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రిక్షా బండ్లు ఇచ్చింది. సంబంధిత అధికారులు వాటిని వినియోగించక పోయినా, కనీసం భద్రపరచకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో అవి వర్షానికి తడచి, ఎండకు ఎండి తుప్పు పట్టి పనికి రాకుండా పోయాయి. వీటితో పాటు ఒక మినీ లారీ కూడా నిరుపయోగంగా ఉంది. ఈనేపథ్యంలో మేజర్ గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ ఎలా జరుగుతుందో అధికారులకే తెలియాలి.

- కలువాయి,(ఆంధ్రజ్యోతి)

ఎడ్లు పెంచాలని.. రాష్ట్రస్థాయిలో నిలవాలని..!

వ్యవసాయం అన్నా, పశువుల పెంపకం అన్నా ఆ యువకుడికి మహాఇష్టం. చేస్తున్నది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అయినా తన అభిరుచి మేరకు రూ.1.8 లక్షలు వెచ్చించి రెండు కోడెదూడలను కొనుగోలు చేశారు. వాటికి పోషకాలు కలిగిన ఆహారం అందించడంతోపాటు వాటి బాగోలు చూసేందుకు నెలవారి జీతంతో ఓ వ్యక్తిని నియమించారు. అంతేకా దండోయ్.. రాష్ట్రస్థాయి ఎడ్లపందేలలో ప్రథమ స్థానం సాధించేందుకు ఆ ఎడ్లకు పొరుగు జిల్లాలో శిక్షణ కూడా ఇప్పిస్తున్నాడు. ఆ వివరాల్లోకి వెళితే..

- వ్యవసాయ కుటుంబంలోని ఓ సాఫ్ట్‌వేర్ ఆకాంక్ష
- రూ.1.8 లక్షలకు రెండు కోడెదూడల కొనుగోలు
- వాటి పోషణపై ప్రత్యేక శ్రద్ధ
- బండ లాగుడు పోటీలకు పొరుగు జిల్లాలో శిక్షణ



తాను పెంచుతున్న ఒంగోలుజాతి ఎడ్లతో బుధవరపు ప్రతాప్

పొదలకూరు మండలం ముత్యాలపేట గ్రామానికి చెందిన బుధవరపు ప్రతాప్‌ది వ్యవసాయ కుటుంబం. బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని పీహెచ్ఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కరోనా సమయంలో వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా ఇంటి నుంచే చేస్తున్నాడు. తాత, తండ్రుల నుంచి వస్తున్న ఎడ్ల పెంపకంపై ఆసక్తి కలిగింది. ఒంగోలు జాతికి చెందిన కోడెలు కొనుగోలు చేసి పెంచాలని భావించి తన తండ్రి పెంచలయ్యతో చెప్పాడు. ఆయన సహకారంతో మూడేళ్ల క్రితం వెంకటాచలం మండలం సర్వేపల్లిలో 8 నెలల వయసున్న దూడను రూ.80 వేలకు, అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏడాది వయసున్న దూడను రూ.లక్ష వెచ్చించి కొనుగోలు చేశారు. ఆ దూడలకు రాముడు, భీముడు అని పేర్లు పెట్టి పెంచాడు. వాటి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ ఆలనా పాలనకు నెల జీతం ఇచ్చి ఓ మనిషిని కూడా ఏర్పాటు చేశాడు. అంతేకాదు.. వాటి పోషణకు నిత్యం రూ.2వేలు వరకు ఖర్చు చేస్తున్నాడు. పశుగ్రాసంతోపాటు ఉలవలు, జొన్నలు కూడా ఆహారంగా ఇస్తున్నారు. పశువైద్యుల సలహాల మేరకు వాటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

పోటీల కోసం ప్రత్యేక శిక్షణ

రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీల్లో తన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలవాలన్న ఉద్దేశంతో ప్రతాప్ రాముడు, భీముడుకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాడు. ఇందుకోసం నెలకు రూ.30 వేలు వెచ్చించి కడప జిల్లా చెన్నూరులో నెల కిందటే శిక్షకుడి వద్ద వదిలిపెట్టినట్లు ప్రతాప్ తెలిపారు. 'ప్రతి నిత్యం వాటిని వీడియోల్లో చూసుకుంటూ శిక్షణకు ఎలా సహకరిస్తున్నాయో తెలుసుకుంటున్నాను. నా ఎడ్ల గురించి తెలిసిన కొందరు రైతులు మంచి ధరకు కొనుగోలు చేస్తామని ముందుకొచ్చినా ఇవ్వలేదు. బండ లాగుడు పోటీల్లో అవి ప్రథమ స్థానంలో నిలిచేలా చేయడమే నా ధ్యేయం' అని ప్రతాప్ చెప్పుకొచ్చారు.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు



ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని
విరమించుకోవాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

కావలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాల్లో ఆప్కాస్‌ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు మల్లె అంకయ్య, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ఆ స్థానంలో ప్రయివేట్ ఏజెన్సీలను పెడతామని మంత్రివర్గ సమావేశంలో కూటమి ప్రభుత్వం నిర్ణయించటంతో ఆప్కాస్‌ని కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. అలా చేస్తే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందన్నారు. న్యాయమైన మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు జే.నాగరాజు, దమ్ము దర్గాబాబు, రవిబాబు,క్రిషోర్, కొండయ్య పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డు ఉద్యమం

కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి):ఆప్కాస్ రద్దు, ప్రైవేట్ ఏజెన్సీ వద్దంటూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రికి రాసిన పోస్ట్‌కార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సీఐటీయు గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచులయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, తురకా శీనయ్య, బాబు, మహేష్, రమేష్ రాజ్యలక్ష్మి, జ్యోతి, పరుసు చిన్నమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్లులేని పేదలందరికీ పీఎంఏవై -2.0 పథకం ద్వారా గృహాలు అందజేసేందుకు అర్హుల సర్వేను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలు నుంచి సోమవారం హౌసింగ్, ఉపాధి హామీ, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇళ్లు లేని పేదలు ఎవరూ ఉండకూడదనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున గృహాలు మంజూరు చేస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్హత ఉండి ఇల్లులేని పేదల ఎంపిక కోసం సర్వేను త్వరితగతిన పూర్తిచేసి నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే ఉపాధి పనులను వేగవంతం చేసి, రోజూ లక్ష పనిదినాలు కల్పించేలా ఎంపీడీవో‌ఏపీవోలు ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీరోడ్లు, మినీ గోకులాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఆధార్ లేని గిరిజనులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందచేసి, ఆధార్‌కార్డులు వచ్చేలా చూడాలన్నారు. సోలార్ విద్యుత్‌పై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ కే. కార్తీక్, జడ్పీ సీఈవో విద్యారమ, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవానీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు విజయన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్



మల్లన్నకు మృగరాజ
వాహన సేవలు

కావలి టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతూరులోని రుద్రపాద క్షేత్రంలోని దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారికి సోమవారం మృగరాజ వాహన సేవలందించారు. శివాలయ ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. కుంభమాన తిరునాళ్లలో భాగంగా మల్లన్నకు ప్రత్యేక చేశారు. గ్రామోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమంలో రాజమండ్రి వాస్తవ్యులు బబూరావు బృందం సభ్యులు దక్షయజ్ఞం బుర్రకథ కాలక్షేపం చేపట్టారు.

ఐటీడీఏ పీవోగా మల్లికార్జున్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జున్‌రెడ్డి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు ఆఫీసర్ (పీవో)గా మల్లికార్జున్‌రెడ్డి సోమవారం నెల్లూరు నగరంలోని ఐటీడీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర కార్యాలయంలో జేడీగా పని చేశారు. ఏడీగా పదోన్నతి పొంది నెల్లూరులో ఐటీడీఏ పీవోగా నియమితులయ్యారు.

ఇంటర్ పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ!

చీఫ్ సూపరింటెండెంట్ వాసు



ప్రశ్నపత్రాలను పెట్టెల్లో భద్రపరుస్తున్న అధికారులు

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 1 నుంచి 16వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించరని చీఫ్ సూపరింటెండెంట్ ఎం వాసు, డిపార్టుమెంట్ అధికారిణి జమున పేర్కొన్నారు. సోమవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 700 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. పరీక్షా కేంద్రంలో అన్ని వసతులు కల్పించామన్నారు. 14 గదులు ఏర్పాటు చేసి 15 మంది ఇన్విజిలేటర్లను నియమించా మన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కాగా, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. దీంతో పరీక్షల నిర్వహణాధికారులు వాటిని పరిశీలించి ప్రత్యేక పెట్టెల్లో ఉంచి సీల్ వేసి స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

సొసైటీల ద్వారా
ధాన్యం కొనుగోలు

దామరమడుగు కేంద్రాన్ని పరిశీలించిన జేసీ కార్తీక్

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని జేసీ సీహెచ్ కార్తీక్ తెలిపారు. సోమవారం ఆయన దామరమడుగు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు, దాచుకునేందుకు గోడౌన్‌లు లేక, రోడ్లమీద ఆరబోసుకోలేని ఇబ్బందులు పడుతున్నామని రైతులు జేసీ ఎదుట ఏకరువుపెట్టారు. ఈ సమస్యలతోనే నష్టమైనా దళారులు, మిల్లర్లకు విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నామని తెలిపారు. దీంతో జేసీ వెంటనే కొనుగోలు కేంద్రాల్లో గోతాలు, ఏర్పాటుతోపాటు తేమ పరికరాలు సిద్ధం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సొసైటీ అధికారులు, కేంద్రాల్లో సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీసీవో గురప్ప, తహసీల్దారు వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, సివిల్ సప్లైస్ డీటీ మల్లికార్జున, సొసైటీ సీఈవో ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

తిరిగొద్దాం..
తెలుసుకుందాం!

- ఆటవిడుపుగా విహారయాత్రలు
- జిల్లాలో 249 మంది ప్రభుత్వ విద్యార్థులకు అవకాశం
- వారి భద్రత కోసం ఉపాధ్యాయులూ ఎంపిక
- నిధులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలకంటే, క్షేత్రస్థాయిలో విద్యార్థులు గమనించే అంశాలే వారిపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. అందుకే ప్రభుత్వం వారిని అప్పుడప్పుడూ విహార, విజ్ఞాన యాత్రలకు పంపుతూ ఉంటుంది. అయితే గత ఐదేళ్ల పాలనలో గాడితప్పిన ఈ ప్రక్రియ తిరిగి జీవం పోసుకుంటోంది. కూటమి ప్రభుత్వం ఈ యాత్రలను పట్టాలెక్కించేందుకు సంకల్పించడంతోపాటు విధివిధానాలను రూపొందించి, నిధులు సైతం విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా జిల్లాలో 249 మంది విద్యార్థులతోపాటు 56 మంది ఉపాధ్యాయులు విహార యాత్రకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

ఆటవిడుపుగా..

ఈ యాత్రలతో తరగతి గదుల్లో చదువులకే పరిమితమైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కాస్తంత ఆటవిడుపు లభించనుంది. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షలు కూడా పర్యటనకు సన్నాహాలు చేస్తున్నాయి. జిల్లాలో ప్రాథమిక స్థాయిలో 146 మంది విద్యార్థులను ఎంపిక చేసి, వీరిని రాష్ట్రం లేదా ఇతర జిల్లాల్లో స్టడీ ట్రిప్ కోసం ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఒక్కో విద్యార్థికి రూ.200 చొప్పున 29,200 కేటాయించింది. ఒకవేళ ఇతర రాష్ట్రంలో పర్యటన కేటాయిస్తే వీరికి రూ.2,92,000 నిధులు కేటాయిస్తామని రాష్ట్రస్థాయి అధికారులు ప్రకటించారు. అలాగే సెకండరీ స్థాయిలో జిల్లాస్థాయి సైన్స్ పెయిర్‌లో పాల్గొన్నవారిలో 33 మంది బాలురు, 70 మంది బాలికలు మొత్తం 103 మందిని ఎంపిక చేయనున్నారు. వీరితోపాటు 33 మంది టీచర్లు, 21 మంది గైడ్ టీచర్లు, సమగ్రశిక్ష ఏఎంవో, జిల్లా సైన్స్ అధికారి కలిపి 159 మంది విహారయాత్రకు వెళ్లనున్నారు. ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున రాష్ట్ర పరిధిలో అయితే 3,18,000, ఇతర రాష్ట్రం అయితే రూ.6,36,000 కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 25వ తేదీలోపు విద్యార్థుల ఎంపికను పూర్తి చేసి నివేదికలు అందచేయాలని సూచించడంతో అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.



ప్రతిపాదనలు సిద్ధం

ప్రాథమిక పాఠశాల పిల్లలను జిల్లాలోని ప్రసిద్ధి ప్రాంతాలకు తీసుకెళ్లడమా? లేదా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడమా...? అనే అంశంపై సమీక్షలు నిర్వహి స్తున్నారు. అలాగే సెకండరీ స్థాయి లో విద్యార్థులను కూడా రాష్ట్రంలోని ఏయే ప్రాంతాలకు తీసుకెళ్లాలి, లేదా పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక లేదా తెలంగాణ ప్రాంతాల్లోని ప్రసిద్ధ ప్రాంతాలకు తీసుకెళ్లాలా? అనే విషయమై చర్చిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులతో విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ సరిపోయేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ యాత్రలు విద్యార్థుల మదిలో స్థిరస్థాయిగా నిలిచిపోవాలని, వారిలో మరింత విజ్ఞానం పెరిగేలా పర్యటన ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలియచేశారు.



పడమటిపాళెంలో హెల్త్‌క్లీనిక్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

ప్రధానమంత్రి టీబీ ముక్త పంచాయతీలుగా పడమటిపాళెం, జంగాలకండ్రిక ఎంపిక

అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

సంగం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి టీబీ ముక్త పంచాయతీలుగా మండలంలోని పడమటిపాళెం, జంగాలకండ్రిక ఎంపికయ్యాయని అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆ గ్రామాలను సందర్శించి హెల్త్ క్లినిక్ రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన టీబీ పరీక్షలు, చికిత్స పూర్తి చేయడం, రోగులకు పోషకాహార నిమిత్తం వారి ఖాతాకు నెలకు రూ. 500 చొప్పున జమ చేయడం, క్రమం తప్పకుండా మందులు వాడడం, పోషకాహారంతో కూడిన ఫుడ్ బాస్కెట్లు ఇవ్వడం వంటి కార్యక్రమాలు నూరు శాతం పూర్తి చేసినందున ఈ రెండు పంచాయతీలు పధానమంత్రి టీబీ ముక్త పంచాయతీలుగా ఎంపికయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర'పై అవగాహన కల్పించండి

● అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ప్రజలను జాగృతం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పి, రీ సైక్లింగ్ ప్రాసెస్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మూడో శనివారం జరిగే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిరంతరం జరిగే ప్రక్రియ అని అన్నారు. పునర్వినియోగపరచలేని వ్యర్థాలను వేరు చేసి, పునర్వినియోగానికి సిద్ధం చేసే ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిద్వారా సంపద ఉత్పత్తి జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలోని పాఠశాలల్లో వ్యర్థాలను విభజించే ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు. ఇందుకోసం ఐటీసీ సహకారం తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఇంజనీరింగ్ శాఖల్లో రీసైక్లింగ్‌తో చేసిన సెంట్రింగ్ మెటీరియల్ వాడే విధంగా కాంట్రాక్టర్లను ప్రోత్సహించాలని సూచించారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వ్యర్థాలతో బీటీ రోడ్డను కనీసం 100 మీటర్లు వేసి, అక్కడ ప్రత్యేక డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి శాఖ వినూత్నంగా ఆలోచించి వ్యర్థాల పునర్వినియోగానికి సిద్ధం చేసే ప్రణాళికలు రచించి, సంబంధిత నివేదికను ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు అందజేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు నిధులు కేటాయించాలి : సీపీఎం

మర్రిపాడు (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల్లో సోమశిల హైలెవెల్ కెనాల్ పనులకు నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ పనులు పూర్తయితే మర్రిపాడు, అనంతసాగరం, ఆత్మకూరు, ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు మండలాల్లోని పొలాలు సస్యశ్యామలం అవుతాయని, వలసలు వెళ్తున్న రైతులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు వెంగయ్య, శ్రీరాములు, రంతుల్లా, గంటా లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఇక సోమశిలకు మంచి రోజులు!

● ఇటీవల డ్యాంను సందర్శించిన ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు

● అత్యవసర పనులపై దృష్టి. యంత్రాంగంలో కదలిక

అనంతసాగరం ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాతోపాటు తిరుపతి, చెన్నై వాసుల దాహార్తి తీరుస్తున్న సోమశిల జలాశయానికి మంచి రోజులొచ్చాయి. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కానున్నాయి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర జలవనరుల శాఖ సాంకేతిక సలహాదారు, విశ్రాంత ఇంజనీరు కన్నయ్య నాయుడు ఇటీవల సోమశిల ప్రాజెక్టును పరిశీలించిన విషయం తెలిసిందే. డ్యాంను అణువణువూ పరిశీలించిన ఆయన భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానిక ఇంజనీర్లను అప్రమత్తం చేశారు. వరదల సమయంలో ఏమాత్రం ఆదమరిచినా డ్యాం భద్రతకు ముప్పు జరగవచ్చన్న భావన వ్యక్తం చేస్తూ అత్యవసర పనులు త్వరగా చేసేలా హెచ్చరికలు జారీ చేశారు. తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుపోయిన విషయాన్ని ఉదాహరణగా భావించి నిత్యం డ్యాం పర్యవేక్షణ చేయాలని ప్రస్తావించగా అధికారుల్లో చలనం వచ్చింది. డ్యాం గేట్ల రోప్‌లు దెబ్బతిని బలహీనంగా ఉండటంతో ఎప్పుడూ లేని విధంగా డెల్టాకు నీరు ఇచ్చే క్రమంలో 6 నెంబరు గేటు ఎత్తి ఈ సీజన్‌లో నీరు విడుదల చేశారు. ఇక 11, 12 గేట్ల రోప్‌లు దయనీయంగా ఉండగా వాటిని వినియోగిస్తే జరిగే పరిణామాలతో 6 నెంబరు గేటుతో నీరు సరఫరా చేశారు. పదేళ్లకోసారి గేట్ల రోప్‌లు మార్చాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇక గేట్లు మొరాయించిన సందర్భంలో గ్యాంటి క్రేన్ వ్యవస్థ అందుబాటులో ఉండగా నిపుణులతో కొన్ని గంటలపాటు ఆ యంత్రాన్ని ట్రయల్‌రన్ చేయాలి. ఆ దిశగా చర్యలు లేక తుప్పుపడుతున్న వైనం కనిపిస్తోంది. గేట్లకు రంగులు దిద్ది, సీళ్లు వేయడం, గ్రీజు పూయడం, కంట్రోల్ కార్యాలయం నుంచి గేట్ల ఆపరేటింగ్ విధానం తదితర అంశాలపై కన్నయ్యనాయుడు విషయ పరిజ్ఞానం చేశారు. ఇక వాటితోపాటు ఉత్తర, దక్షిణ కాలువ, తెలుగు గంగ వరద కాలువ గేట్ల పరిస్థితి అధ్యయనంపై అధికారులు చర్యలు చేపట్టారు. త్వరలో ప్రత్యేక అండర్‌వాటర్ వర్క్ టీంను పిలిపించి నీటిలోపల దెబ్బతిన్న రోప్‌లు గ్యాస్ కటర్ సహాయంతో కట్ చేసి నీటి వృథా జరగకుండా జాగ్రత్తలు పాటిస్తూ పనిచేసేలా చర్యలు చేపట్టనున్నారు. ఆలస్యం లేకుండా పనులు చేసేలా కన్నయ్య నాయుడు పూర్తిస్థాయి నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇవ్వనున్నారు. ఆ దిశగా త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.



రోప్‌లు దెబ్బతినడంతో 6వ నెంబరు గేటు ద్వారా విడుదల చేసిన నీరు (ఫైల్)



టిప్పర్లను అడ్డుకున్న కడనూతల గ్రామస్థులు (ఫైల్)

ఆగని గ్రావెల్ తవ్వకాలు

● పట్టించుకోని అధికారులు

● దళారులతో ఇతర ప్రాంతాల్లో విక్రయం

బిట్రగుంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు, అమ్మకాలు జరిపిన మాఫియా కొత్త అవతారం ఎత్తి ఇతర ప్రాంతాలకు దళారుల ద్వారా అమ్ముకుంటూ లక్షలు సంపాదించుకుంటున్నారు. అరికట్టాల్సిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో వారికి అందులో భాగం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైసీపీ పాలనలో గ్రావెల్ తరలించినా మాఫియా కొందరు టీడీపీ నేతలతో కుమ్మక్కై పర్సంటేజీలతో ఒప్పందాలు కుదుర్చుకుని జోరుగా తవ్వకాలు జరుపుతున్నారు.

ప్రభుత్వాలు మారిన అక్రమ తరలింపు ఆగలేదు

- 2024 నవంబరు 18వ తేదీ రాత్రి కప్పరాళ్ల తిప్ప బాడన్‌పేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమీపంలో గ్రావెల్ తవ్వకాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. స్థానిక పోలీసులకు సమాచారం తెలియజేయడంతో జేసీబీ, టిప్పర్‌తో ఉడాయించారు. నంబరు లేని టిప్పరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసును మైనింగ్ అధికారులకు అప్పగించడంతో జరిగిమానాతో సరిచేశారు.
- 2025 జనవరి 15 నుంచి తాళ్లూరు పంచాయతీలో అనుమతు లేకుండా తవ్వకాలపై పోలీసులకు సిద్ధమవగా పసిగట్టిన గ్రావెల్ మాఫియా అక్కడి నుంచి జారుకున్నారు.
- ఫిబ్రవరి మొదటి వారం నుంచి కడనూతల చెరువులో అధికారులు, స్థానికుల కళ్లుగప్పి రాత్రికి రాత్రి కావలి, ముసునూరు ప్రాంతాలకు చెందిన కొందరు అక్రమంగా గ్రావెల్ తలింపు జరుపుతున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు హెచ్చరిస్తున్నా వినిపించుకోకుండా రాత్రులు తవ్వకాలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు మాత్రం వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.
- ఈ నెల 22వ తేదీ రాత్రి కడనూతల గ్రామస్థులు గ్రావెల్ తరలింపును అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వచ్చి రెండు టిప్పర్లు, జేసీబీని అదుపులోకి తీసుకున్నారు.
- ఇదేవిధంగా నాగులవరం, బిట్రగుంట తదితర ప్రాంతాల్లో అక్రమంగా అనుమతులు లేకుండా పెద్దల పేర్లు చెప్పుకుంటూ గ్రావెల్, మట్టి విచ్చలవిడిగా తరలిస్తున్నట్లు స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అక్రమ గ్రావెల్ తవ్వకాలపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదుదారుల అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్



కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

సమస్యలు పరిష్కరించాలని 456 వినతులు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌కు జిల్లా ప్రజలు పోటెత్తారు. 456 మంది అర్జీదారులు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజా సమస్యల పరి ష్కార వేదిక ఉదయం 10 ప్రారంభమై మధ్యాహ్నం 3గంటల వరకు జరిగింది. కలెక్టర్ ఓ. ఆనంద్, జేసీ కే. కార్తీక్ అర్జీదారుల సమస్యలను తెలుసు కుని , సంబంధిత అధికారులను పిలిచి పరిష్క రించాలని ఆదేశించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది.

● **ఎస్సీ వర్గీకరణ చేయాలి..**

సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మానికల మురళి, చెంబేటి ఉష, తిరివీధి సతీష్‌చంద్ర, పొట్టేళ్ల నాగరాజు, మానికల నాగమణి, పొట్లూరు శీనయ్య, తలపల రమేష్, పాల్గొన్నారు.

● **చెరువును కాపాడాలి..**

వెంకటాచలం మండలం చెముడుగుంటలోని కుంకుమపూడి చెరువు ఆక్రమణకు గురైందని, ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మారంరెడ్డి రాధారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● **పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయించాలి**

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయించాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రఘురామయ్య, అల్లూరు నాగేంద్ర సింగ్,ర రత్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● **చేనేతకు నిధులు కేటాయించాలి**

బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పముజుల రవి కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు జీ.చైతన్య, రాంబాబు, తదితరులు పాల్గొ న్నారు.

● కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్, ఇతర అలవెన్స్‌లను చెల్లించాలని కార్మికులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

● సంక్షేమ నిధిని పునరుద్ధరించి ఆదుకోవాలని కలెక్టర్‌కు భవన నిర్మాణ కార్మికులు వినతిపత్రం అందజేశారు.

● నగరంలోని పరమేశ్వరినగర్‌లో ఉన్న ఖాళీస్థలాల్లో దోమలు వ్యాపించకుండా చూడాలని ఆ ప్రాంతవాసులు కలెక్టర్‌ను కోరారు.

కలెక్టరేట్‌లో ఆరోగ్య శిబిరం

కలెక్టరేట్‌లో సోమవారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాదిమంది శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, ఉచితంగా మందులు పొందారు. కార్యక్రమంలో అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్‌పటేల్, కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్, కార్పొరేట్ వ్యవహారాల అధిపతి కేఎం.రామ్, హెచ్‌ఆర్ అడ్మిన్ అధిపతి అనురాగ్ ద్వివేది, భద్రత పర్యావరణ విభాగ అధిపతి కౌశల్‌సింగ్, డాక్టర్ సుహర్షన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యతపై పోస్టర్‌ను కలెక్టర్ ఆనంద్ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆర్థిక అంశాలపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలేవీ!

మొక్కుబడిగా ప్రత్యేక డ్రైవ్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతున్నా, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేస్తున్నా గ్రామాల్లో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో శని, ఆదివారాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలనే సంకల్పంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. అందులో భాగంగా ఇంటింటా చెత్త సేకరణతో పాటు వీధులు, ప్రధాన రహదారుల్లోని చెత్తకుప్పలు, పేడదిబ్బలు తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది. కాగా, అలాంటి ఆదేశాలు తమకు వర్తించవన్న ధీమాతో కొంతమంది అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాలను పరిశీలించగా పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. అధికారులు తమకు అను కూలమైన గ్రామాల్లో మాత్రమే నామ మాత్రంగా చెత్తను సేకరించి ఫోటోలకు ఫోజులిచ్చారే తప్ప పూర్తిస్థాయి శ్రద్ధ వహించనే లేదు. అధికశాతం గ్రామాల్లో చెత్తను సేకరించకపోగా కనీసం ప్రజలకు అవగాహన కల్పించిన దాఖలాలు కూడా లేవు. అందుకు నిదర్శనం ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామంలోని వీధుల్లో చెత్తకుప్పలు, అలాగే వరికుంటపాడు మండ లంలోని గువ్వాడి గ్రామంలోని ప్రధాన రహదారికి ఆనుకొని పాఠశాల సమీపంలో దారి పొడవునా ఉన్న పేడదిబ్బలు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మారుమూల గ్రామా ల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గండిపాళెం వీధుల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారం

మీ పిల్లలైతే ఇలాగే చేయిస్తారా..?

● విద్యార్థులతో చపాతీలు చేయించడంపై అధికారుల ఆగ్రహం

● విచారణలో పూర్తి వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడి



ఉపాధ్యాయులు, వంట మనుషులను విచారిస్తున్న అధికారులు

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాలలో వారిచే వంటపని చేయిస్తారా.. అదే మీ పిల్లలైతే ఇలాగే చేయిస్తారా.. అంటూ ప్రిన్సిపాల్, వంట మనుషులపై అధికారులు మండిపడ్డారు. మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థుల చేత చపాతీలు చేయించడంపై సోమవారం పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టి నివేదిక పంపాలని ఆత్మకూరు డిప్యూటీ డీఈవో జానకిరామ్, ఉదయగిరి ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులను ఆదేశించారు. దీంతో వారు సోమవారం పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్, వంట మనుషులు, విద్యార్థులను విచారించారు. మీరు ఎక్కడ పడుకుంటారు, ఎన్ని గంటలకు లేస్తారు, ఎవరు లేపుతారు, ఒక్కో విద్యార్థి ఎన్ని చపాతీలు చేస్తారు.. అంటూ ప్రశ్నించారు. తాము వసతిగృహంలోనే నిద్రిస్తామని, తెల్లవారుజాము 4 గంటలకు వంటమనిషి నిద్రలేపుతాడని, వారు పిండి సిద్ధం చేస్తే తాము చపాతీలు రుద్దుతామని విద్యార్థులు వివరించారు. అలాగే ప్రిన్సిపాల్, వంట మనుషులను విచారించారు. 17 మంది విద్యార్థుల చేత 1500 చపాతీలు చేయించడమేంటి.. మీ పిల్లలైతే ఇలా చేయిస్తారా.. అంటూ మండిపడ్డారు. ఈ విధానం ఎప్పటినుంచో జరుగుతుందని ప్రిన్సిపాల్ వివరించడంతో మీరు ఎందుకు ఉండేది.. మార్చుకోవచ్చు కదా, మెనూలో పూరీ ఉండగా చపాతీ ఎందుకు చేశారని ప్రశ్నించారు. ఈ నిర్వాకంపై ఒక వంటమనిషిని బాధ్యుడిని చేసి విధుల నుంచి తొలగించడం ఏమిటని అధికారులు ప్రశ్నించారు. కాగా, అధికారుల విచారణలో పాఠశాలలో చోటుచేసుకుంటున్న కొన్ని ఘటనలు సైతం విద్యార్థులు వివరించినట్లు తెలిసింది. విచారణలో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు. విద్యార్థులు వంటపని చేయడంపై జువైనల్ కోర్టులో సైతం పిర్యాదు చేసినట్లు సమాచారం.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కావలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కావలి డివిజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో ఎం.వంశీకృష్ణకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో అవసరం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ 15రోజుల కిందట ప్రకటించి ఇప్పటికీఈ డివిజన్‌లో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

● అల్లూరి సీతారామరాజు జిల్లాకి చెందిన నిందితుడి అరెస్టు



గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న జీఆర్‌పీఎస్ పోలీసులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీఎస్ పోలీసులు 10 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను రైల్వే పోలీసుస్టేషన్‌లో సీఐ కే భుజంగరావు సోమవారం వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా బురుగు బయలు గ్రామానికి చెందిన పూజారి సన్యాసిరావు నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్ రెండు, మూడు ప్లాట్‌ఫారమ్‌ల మధ్య బ్యాగ్‌తో కూర్చొని ఉన్నాడు. జీఆర్‌పీఎస్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న సన్యాసిరావును అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అక్కడ బ్యాగ్‌ను పరిశీలించగా 10 కేజీలు బరువు కలిగిన ఐదు గంజాయి ప్యాకెట్లను గుర్తించారు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, కేసు విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

మినీ ట్రక్కును ఢీకొన్న కంటైనర్ లారీ



ప్రమాదానికి గురైన వాహనం

కావలి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగయ్యగారిపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొన్నది. బాధితుడు హరిప్రసాద్ వివరాల మేరకు.. తెనాలి నుంచి సున్నంబట్టీకి 40 క్యాన్ల కాపర్ వేస్టువాటర్‌తో వెళుతున్న అశోక్ లేలాండ్ వాహనం మార్గమధ్యలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువకు వస్తున్న సమయంలో వాహనం వెనుక వైపు ఉన్న యాగ్జిల్ రాడ్ విరిగిపోయింది. దీంతో టైరు రోడ్డుపై కొంత దూరం పడటంతో హరిప్రసాద్ వ్యానును నిలిపాడు. రోడ్డుపై పడిపోయిన టైరు తెచ్చే లోపు వ్యానులోని మరో వ్యక్తి వెనుక వచ్చే వాహహనాలకు లైట్ చూపుతున్నా చెన్నై వైపు వెళ్తున్న కంటైనర్ లారీ వేగంగా వచ్చి వ్యానును ఢీకొంది. వ్యాను పక్కనే రోడ్డుపై ఉన్న వారు పక్కకు పరుగులు తీయటంతో ప్రాణాలతో బయటపడ్డారు. వ్యానులోని కాపర్ వాటర్ క్యాన్లు రోడ్డుపై చెల్లాచెదరుగా పడిపోయాయి. ప్రమాదాన్ని గుర్తించిన హైవే మొబైల్ సిబ్బంది క్రేన్‌తో వాహనాలను రోడ్డుపై నుండి పక్కకు తీసి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

ఫిర్యాదులపై చట్టపరంగా న్యాయం చేస్తాం : ఎస్పీ

నెల్లూరు(క్రైం) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై విచారణ జరిపి, చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ జీ. కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన వేదికలో జిల్లా వ్యాప్తంగా 80మంది వారి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వాటిని స్వీకరించిన ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

చెల్లాయపాళెంలో ఇళ్లపై దాడులు

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి): చెల్లాయపాళెంలో గుర్తుతెలియని దుండగులు సోమవారం ఇళ్లపై దాడులు చేశారు. గృహోపకరణాలను ధ్వంసం చేయడంతోపాటు పలువురిని దారుణంగా కొట్టారు. తమ్మిరెడ్డి విజయమ్మ, సుబ్బమ్మ, ఐశ్వర్య సుకన్య, తమ్మిరెడ్డి వెంకటశేషయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. 100 ఫిర్యాదుతో పోలీసులు చెల్లాయపాళెం చేరుకుని రౌడీలలో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనతో చెల్లాయపాళెంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా చెల్లాయపాళెంలో టీడీపీ నాయకుడు తమ్మిరెడ్డి మల్లికార్జున, ఆయన తమ్ముడు కుటుంబాల మధ్య భూ వివాదంతో తరచూ వివాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే బుచ్చి మండలంలోని పెనుబల్లి, పోలినాయుడు చెరువు, తాజాగా చెల్లాయపాళెంలో రౌడీ చేష్టలతో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసిన విషయం విదితమే.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	90
లేయర్ లైవ్	75
స్కిన్ చికెన్	168
స్కిన్‌లెస్	188
లేయర్	127

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8332
వెండి కిలో ధర	రూ. 99,200
వెండి ఒక గ్రాము	రూ.102.20

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

'ఇటుక'ట్లు..

- అమ్మకాలు లేక నిలిచిన బట్టీల నిర్వహణ
- గతేడాది తయారు చేసిన ఇటుకలే నిలువ
- గిరాకీలేక వ్యాపారం చేయలేమంటున్న తయారీదారులు



వలేటివారిపాలెంలో అమ్మకాలు లేక నిలిచిపోయిన బట్టీలోని ఇటుకలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి, వలేటివారిపాలెం, కాకర్ల వారిపాలెం, పోలినేనిచెరువు, అంకభూపాల పురం, పెదఅమ్మపాలెం, అయ్యవారిపల్లె గ్రామాల్లో ఇటుక బట్టీల యజమానులు తీవ్ర నష్టాల్లో కూరుకపోయారు. గతేడాది తీసిన ఇటుకలకు అమ్మకాలకు గిరాకీ లేకపోవడంతో వ్యాపారం చేయలేమని ఇటుక బట్టీల యజమానులు ఈ ఏడాది చేతులెత్తేశారు. దీనికితోడు బట్టీలు పెట్టేందుకు అవసరమైన పెట్టుబడులు (కూలీల రేట్లు, ఇటుకల తయారీకి అవసరమైన ముడిసరుకులు) అధికం అవడంతో ఇటుకల తయారీకి ఆసక్తి చూపడం లేదని బట్టీల యజమానులు వాపోతున్నారు. ఈ సమస్యలతో వందల కుటుంబాలు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డాయి.

● ఎర్రమట్టి ఇటుకలే వినియోగం..

ఎర్ర మట్టితో తయారు చేసిన ఇటుకలను బట్టీలుగా పేర్చి కాల్చడం వల్ల ఎక్కువగా గట్టిదనం ఉంటుందని భావించి తరతరాలుగా ఈ ఇటుకలనే ఉపయోగిస్తున్నారు. పెట్టుబడులు అధికం కావడం.గిరాకీ లేక ఇటుక బట్టీల యజమానులు గతంలో వేసిన వాటిని అమ్ముకుంటే చాలు తరువాత చూద్దాం అన్న భావనలో ఉన్నారు. ఈ ఏడాది ఇటుకల బట్టీలు చేసే వారు లేరు. గతేడాది 25మంది బట్టీల యజమానులు 2కోట్ల ఇటుకలకు పైగా తయారు చేయించారు.

● తగ్గిన ధరలు..

గతంలో 2వేల ఇటుక రూ.18వేలకు అమ్మకాలు జరిపేవారు. కానీ గృహ నిర్మాణాలు చేసేవారు తగ్గిపోవడంతో ప్రస్తుతం వాటి ధర రూ.12 వేలకు పడిపోయింది. గతంలో ఇటుకలు తయారీ చేసేందుకు చీరాలు, ఒంగోలు, శింగరాయికొండ, టంగుటూరు, కందుకూరు తదితర చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వంద కుటుంబాలకు పైగా ఈ ప్రాంతానికి వచ్చేవారు. అంతేగాకుండా కాల్చిన ఇటుకలను అమ్మకాలు సమయంలో ట్రాక్టర్లలో ఇటుకలను వేసేందుకు కూలీలకు ఉపాధి దొరికేది.

● తయారీకి వాడే ముడిసరుకులు

లక్ష ఇటుకలు తయారీకి దాదాపు 80 ట్రాక్టర్ల మట్టి 20టన్నుల బొగ్గుతో పాటు కర్రలు కూడా అవసరం అవుతాయి. ఇటుకలు చేసిన తరువాత వాటిని శుద్ధి చేసి బట్టీలుగా ఏర్పరచి కాల్చిన వారం వరకూ బట్టీలకు కాపలా ఉంటారు. కూలీ రేట్లు కూడ పెరగడం పెట్టుబడులకు అప్పులు తెచ్చి పెట్టినా అసలు కూడా రాకపోవడంతో చాలా మంది ఇటుకల తయారీని నిలిపివేశారు. మామూలుగా ప్రతి ఏడాది నవంబరు, డిసెంబరులోనే ఇటుకలు తయారీకి కూలీలు వచ్చేవారు. ఈ ఏడాది కూలీల చాయలే కనిపించలేదు.

● అమ్మకాలు తగ్గాయ్..

ఇటుకబట్టీల తయారీకి పెట్టుబడులు ఎక్కువ అవడంతో అమ్మకాలు తక్కువయ్యాయి. దీనికితోడు ప్రస్తుతం గృహ నిర్మాణాలు కట్టేవారు తక్కువ కావడంతో గతంలో వేసిన ఇటుక బట్టీలు అలాగే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న ఇటుకలు అమ్ముకుంటే చాలు. కూలీరేట్లు, పెట్టుబడులు కూడా పెరగడంతో గిట్టుబాటు కాక తీవ్ర నష్టాల్లో కూరుకపోయాం.

- పొట్టేళ పెదఅంజయ్య,
ఇటుకవ్యాపారి వలేటివారిపాలెం

న్యూస్ బాక్స్

శ్రీశైలం తరలిన భక్తులు

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణంపల్లి గ్రామానికి చెందిన పలువురు శివమాల ధరించిన భక్తులు సోమవారం ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం తరలివెళ్లారు. మండలం రోజుల పాటు కఠోర దీక్షబూని వారు ఉదయగిరి పార్వతీ పరమేశ్వరాలయంలో విశేష పూజల అనంతరం ఇరుముడి ధరించి తరలివెళ్లారు.

సంసిద్ధత మేళా ప్రారంభం

కావలి టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో ఎంపీడీవో పాల్గొని పాఠశాల సంసిద్ధత మేళాను ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అంగన్‌వాడీలు తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 గోవిందయ్య, ఎంఈవో-2, వెంకటసుబ్బయ్య, రిసోర్స్‌పర్సన్లు మధుసూదన్‌రావు, సుహాసిని పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచన పెరగాలి

కావలి టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ ఆలోచన విధానాలు పెంచుకోవాలని మండల విద్యాధికారి గోవిందయ్య తెలిపారు. జేవీవీ ఆధ్వర్యంలో సోమవారం రెడ్‌క్రాస్ భవనంలో క్విజ్ పోటీలు సంఘం అధ్యక్షుడు శేట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగాయి. ముఖ్యఅతిథిగా గోవిందయ్య పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో 20పాఠశాలల నుంచి 60మంది సీనియర్స్ విభాగంలో 19పాఠశాలల నుంచి 57మంది పాల్గొన్నారు. రామకృష్ణ, రమణయ్య, జిలాని, సత్యనారాయణలు మాస్టర్లుగా వ్యవహరించారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

అల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేటలోని షిర్డీసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ చేపట్టి 17ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు కార్తీక్ శర్మ, సుబ్బారావు శర్మల ఆధ్వర్యంలో చేపట్టిన పూజల్లో మహిళలు పూజ సామగ్రితో పాల్గొన్నారు. వ్రతం అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు.

రుణాలకు ఇంటర్వ్యూలు

కావలి రూరల్, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయంలో బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులకు సోమవారం బ్యాంకర్లతో ఇంటర్వ్యూలు చేపట్టారు. 629మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 356మంది దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలను బ్యాంకర్లు పరిశీలించినట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు.

అర్హులకు పింఛన్లు ఇవ్వాలి

బిట్రగుంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేయాలని వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు సోమవారం తహసీల్దారు సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ ఎం.సుజాత, జడ్పీటీసీ ఎం.కీర్తన, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్, శ్రీనివాసులు, ఎంపీటీసీలు పద్మ, సుందర్‌రాజ్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణంపై ఫిర్యాదు

నంగం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సంగం పంచాయతీలో ఓ వ్యక్తి వ్యవసాయ భూమిలో ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా ఇళ్ల నిర్మాణం చేశాడని పప్పూరి హజరత్తయ్య అనే వ్యక్తి సోమవారం గ్రీవెన్స్‌డేలో తహసీల్దారుకు ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా 252సర్వే నెంబరులోని 50అంకణాల ప్రభుత్వ భూమిని ఇతరులకు విక్రయించి వేరే పట్టా నెంబరుతో బుచ్చిరెడ్డిపాళెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరాడు.

రుణాలు చెల్లించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పొదుపు సంఘాల సభ్యులు వివిధ పథకాల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం ఖాజారంతుల్లా కోరారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో అప్జాజీతో కలిసి ఈసీ సమావేశం నిర్వహించారు. రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి నూరు శాతం రికవరీ సాధించాలన్నారు. గ్రామాల్లో జరిగే స్వచ్ఛత కార్యక్రమాల్లో పొదుపు సంఘాల సభ్యులు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కరీముల్లా, సీసీలు పాల్గొన్నారు.

పీ4 సర్వే చేపట్టాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేను సచివాలయ సిబ్బంది బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీవో అప్జాజీ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 22 నుంచి జరుగుతున్న ఈ సర్వేలో భాగంగా సిబ్బంది ప్రతి ఇంటికెళ్లి సమగ్ర వివరాలు సేకరించి నమోదు చేయాలన్నారు. మండలంలో 10206 గృహాలను సందర్శించి సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 6,253గృహాల సర్వే పూర్తిచేశారన్నారు.

ఆర్థిక సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ మేరీ చర్చి వార్షికోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డిల సూచన మేరకు సోమవారం టీడీపీ, జనసేన నాయకులు అన్నప్రసాదానికి ఆర్థిక సాయం అందజేశారు.

పనిగట్టుకుని ఆరోపణలు చేయడం మానుకోండి

● మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

జలదంకి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కొందరు ఇతర పార్టీ నేతలు పనిగట్టుకుని టీడీపీ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచిది కాదని, ఇప్పటికైనా ఇలాంటి ఆరోపణలు చేసేవారు ఇప్పటికైనా మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి హితవు పలికారు. సోమవారం ఆయన బ్రాహ్మణక్రాకలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై ఇటీవల కాలంలో వస్తున్న అవినీతి ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కాకర్ల సురేష్ ఎన్ఆర్ఐగా అమెరికాలో స్థిరపడిన కాకర్ల పేదలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రజల మద్దతు కూడగొని ఎమ్మెల్యే అయినట్లు చెప్పారు. మాఫియా సొమ్ముతో పార్టీ సభ్యత్వాలు చేయాల్సిన ఖర్మ టీడీపీకి ఇప్పుడు, ఎప్పుడూ లేదన్నారు. మేకపాటి రాజారెడ్డి ఎప్పటికీ ఉదయగిరి ఎమ్మెల్యే కాలేడని ఈ సందర్భంగా వంటేరు జోస్యం చెప్పారు. ఎంపీగా ఉన్న సమయంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి నడికుడి రైల్వేలైను వచ్చేస్తోందని చెప్పాడే తప్ప ఈ నాటికీ రైల్వేలైను అతీగతి లేదన్నారు. రాజమోహన్‌రెడ్డి, రాజారెడ్డి ఉదయగిరికి చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి, కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కావ్య క్రిష్ణారెడ్డి, కాకర్ల సురేష్‌లు ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చారన్నారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, బ్రాహ్మణక్రాక సర్పంచ్, ఉపసర్పంచులు ఇండ్ల సుధాకర్, డి.మాల్యాద్రిరెడ్డి, నాయకులు మధుసూదనరావు, తిరుమలరెడ్డి, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు

లింగసముద్రం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరుగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని మొగిలిచెర్ల దత్తాత్రేయస్వామి ఆలయం, లింగసముద్రం తిరుమణిశెట్టి కోటయ్య మందిరం ముస్తాబవుతున్నాయి. ఆలయాలను నిర్వాహకులు భక్తుల కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే లింగసముద్రం తిరుమణిశెట్టి కోటయ్యస్వామి మందిరంలో జరిగే ఉత్సవాలకు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుండే కాక దూర ప్రాంతాల నుంచి కూడా తరలివస్తారు. నిర్వాహకులు భక్తులకు పండుగ రోజు మధ్యాహ్నం, రాత్రి అన్నదానం ఏర్పాటు చేస్తామని ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. అలాగే రాత్రికి పందిరి భజన, కోలాటం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఆలయాల వద్దకు వచ్చేందుకు భక్తుల కోసం కందుకూరు, కావలి డిపోల నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

● బిట్రగుంట(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని శైవ ఆలయాల్లో మంగళవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా సోమవా రం ఆలయశుద్ధి పనులు చేపట్టారు. విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి, అమ్మవార్లకు విశ్వనాథరావుపేట గోపిశెట్టి వేణుగోపాల్, పద్మావతి దంపతులు మకర తోరణాలను అందజేశారు.

● ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ డిపో పరిధిలోని ఆయా క్షేత్రాలకు 19బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఉదయగిరి-సిద్దేశ్వరం-7, ఉదయగిరి-భైరవకోన-7, సీతారామపురం-కోవిలంపాడు-3, సీతారామపురం-సిద్దేశ్వరం-2 చొప్పున బస్సులు నడుపుతున్నామన్నారు. భక్తుల రద్దీని బట్టి అదనపు సర్వీసులు సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బస్సుల్లో సాధారణ చార్జీలే వసూలు చేయడం జరుగుతుందని, భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

● అనంతసాగరం (ఆంధ్రజ్యోతి):సోమశిల సోమేశ్వరాలయం, కామిరెడ్డిపాడు అటవీ ప్రాంతంలో ఉన్న దుర్గమ్మ ఆలయం, చిలకలమర్రి వద్ద మల్లెంకొండ శిలలు బుధవారం జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబ య్యాయి. ఈ సందర్భంగా జాగారం కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో కొనసాగాలి

● కందుకూరు న్యాయవాద సంఘం సభ్యుల డిమాండ్

కందుకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సివిల్ జడ్జి పరిధిలో ఉన్న పొన్నలూరు, సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి మండలాలను నూతనంగా సింగరాయకొండలో ఏర్పాటు చేయనున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కాకుండా యధావిధిగా కొనసాగించాలని కందుకూరు న్యాయవాద సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వివి సుబ్బారావు, పండిట్ సంపత్ కుమార్‌లు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒంగోలు జిల్లా కోర్టుకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిని నిర్ణయిస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఈనెల 14న ఉత్తర్వులు జారీ చేయడం శోచనీయం అని పేర్కొన్నారు.

అధికారుల గైర్హాజరుతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెలవెల

ఉదయగిరి, ఫిబ్రవరి 24: నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెలవెలబోయింది. ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి వివిధ శాఖలకు చెందిన సుమారు 18 మంది అధికారులు హాజరు కావాల్సి ఉంది. అయితే 11గంటల సమయంలో తహసీల్దారుతోపాటు కేవలం ఐదు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రతి వారం ఇదే పరిస్థితి ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమానికి హాజరైన కొందరు అధికారులు విలేఖరులు ఫోటోలు తీస్తున్నారు, రండంటూ కొన్ని శాఖల అధికారులకు ఫోన్‌లు చేస్తుండడంతో వారో లేదా వారి సిబ్బందో హడావిడిగా వచ్చి కార్యక్రమాన్ని హాజరై మమ అనిపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శిక్షణ కార్యక్రమం పరిశీలన

సీతారామపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, ఈవోపీఆర్డీ భార్గవి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెహమాన్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలుచేయడం ద్వారా చక్కని ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈసందర్భంగా శిక్షణ కేంద్రంలో తయారుచేసిన బోధనోపకరణాలను పరిశీలించారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



కోటీశ్వరాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ వేమారెడ్డి, ఎస్ఐ తిరుమలరావు


చేజర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కోటితీర్థం గ్రామంలోని కోటీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు నంగం సర్కిల్ సీఐ వేమారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆల య వద్ద ఏర్పాట్లను ఎస్ఐ తిరుమలరావుతో కలసి పరిశీలించారు. వారంరోజుల పాటు జరిగే ఉత్సవాలలో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక క్యూలైన్లలో భక్తులకు త్వరితగతిన దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ కొమ్మి పార్థసారధి, స్థానికులు పాల్గొన్నారు

భూసమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తమ రిజిస్ట్రేషన్, అసైన్‌మెంట్ భూములకు సంబంధించి 1బీ, అడంగల్ పత్రాలు ఆన్‌లైన్‌లో వచ్చేలా చర్యలు చేపట్టాలని సోమవారం బండగానిపల్లి పంచాయతీలోని పలు గ్రామాల రైతులు తహసీల్దారు సుభద్రకు విన తిపత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో తమ భూము లకు సంబంధించి 1బీ, అడంగల్ పత్రాలు రాకపో వడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని వాపోయారు.

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

● అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి




వైద్యశాలలో మందులు పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్ వలి

ఉదయగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలల్లో స్కానింగ్ ద్వారా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ, పలు ప్రైవేటు వైద్యశాలలను వైద్యఆరోగ్య సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. స్కానింగ్ సెంటర్‌లో ఎలాంటి దేవుళ్ల ఫోటోలు పెట్టరాదని, లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని సూచిస్తూ ప్రతి వైద్యశాలలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీ, గండిపాళెం పీహెచ్‌సీలో మందులను, ఫ్రిజ్‌లో ఉన్న టీకాలను పరిశీలించారు. అర్హులైన వారికి బీసీజీ టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శివకల్పన, ప్రశాంత్, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి తనిఖీ చేసి ల్యాబ్, ఫార్మసీ, డెలివరీ గదులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అయూబ్‌అఫ్సర్, వనజ, సిబ్బంది పాల్గొన్నారు.

సింహ వాహనంపై భీమేశ్వరుడు



సింహ వాహనంపై ఊరేగుతున్న భీమేశ్వరస్వామి

నంగం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వంగల్లులోని భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున భీమేశ్వరస్వామి సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భం గా స్వామివారి గ్రామోత్సవానికి భక్తులు స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌కు పూలంగి సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యూపీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయండి

లింగసముద్రం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పెంట్రాల ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని టీడీపీ నాయకులు కిలారి కొండయ్య, జడ కొండయ్య, దార్ల మధుసూదనరావులు సోమవారం ఓ ప్రకటనలో ఉన్నతాధికారులను కోరారు. ప్రస్తుతం విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులలో భాగంగా తమ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాల గా మార్పు చేయాలని అధికారులు నిర్ణయించారని ఈ నిర్ణయంతో పాఠశాలలో చదివే 6,7,8 తరగతుల విద్యార్థులు 4కి.మీ దూరంలోని లింగసముద్రం హైస్కూల్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. కొందరు విద్యార్థులు స్కూల్ మానేసే అవకాశం ఉందన్నారు.

'రుణాలివ్వక పోవడం అన్యాయం'

అల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు రుణాలకు మంజూరు చేయకపోవడం అన్యాయం అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. సోమవారం ఆయన ఈ విషయంపై స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట దళితులు, గిరిజనులతో కలసి నిరసన చేపట్టి మాట్లాడారు. గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తలపించేలా కూటమి ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని విమర్శించారు. వెనుకబడిన గిరిజనులు బతుకుతులు మార్చేందుకు కార్పొరేషన్ లోన్లు మంజూరు చేయాలని డిమాండు చేశారు. కేంద్రం మంజూరు చేసే నిధులను దారిమళ్లించడం దారుణం అన్నారు. త్వరలో రుణాలను మంజూరు చేయాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చవుటూరి శ్రీనివాసులు, ఎస్.ఏడుకొండలు, శ్రీనివాసులు, జడ్డా వాసు, కత్తి విజయమ్మ, సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.

శ్రద్ధగా చదవి మంచి మార్కులు సాధించండి

కలిగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సోమవారం జరిగిన సరస్వతీపూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్‌ను అందజేయగా స్థానికులు మేడం నరసింహారెడ్డి, వెంకటశేషయ్య పరీక్షల విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, కేజీబీవీ ప్రిన్సిపల్ కే.సుప్రియ పాల్గొన్నారు. అలాగే సిద్ధనకొండూరు జడ్పీ ఉన్నతపాఠశాల పదో విద్యార్థులు సరస్వతీదేవి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీకాంతం, ఎస్ఎంసీ చైర్మన్ అంబటి మాల్యాద్రి పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక వైద్య సేవలు

కలిగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీని సోమవారం జిల్లా అడిషనల్ వైద్యాధికారి, టీబీ లెప్రసీ నోడల్ అధికారి ఎస్‌కే.ఖాదర్‌వలి సందర్శించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్నిగ్రామాల్లో పీహెచ్‌సీ సిబ్బంది టీబీ, హెచ్ఐవీ అనుమానిత కేసులను గుర్తించాలని కోరారు. అలాంటి కేసులకు ప్రత్యేక మందులు మింగించే బాధ్యతను వైద్య సిబ్బంది తీసుకోవాలని సూచించారు. అనం తరం వైద్యులు రామనాథం స్మారక ప్రజావైద్యశాల, యుకే.స్పెషాలిటీ వైద్యశాలలను సందర్శిం చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శైవక్షేత్ర గర్భాలయ రాతి ద్వారబంధ ప్రతిష్ఠ

బిట్రగుంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బోగోలు మణికంఠనగర్‌లో నిర్మాణంలో ఉన్న శైవక్షేత్ర గర్భాలయ రాతి ద్వారబంధ ప్రతిష్ఠ శ్రీరామగిరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం శాస్త్రోక్తంగా ని ర్వహించారు. ద్వారబంధ దాత దేవరాల తిరుపతి తల్లితండ్రులు సుబ్బయ్య రమణమ్మల జ్ఞాపకార్థం అందజేశారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోనే ప్రథమ శైవక్షేత్రంలో విఘ్నేశ్వర సు బ్రహ్మణ్య అయ్యప్ప విశ్వేశ్వర అన్నపూర్ణ సమేత శివాలయ నిర్మాణ పనులు భక్తుల సహకారంతో జరుగుతునట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయలక్ష్మీ, కుంచాల రుమ లరావు, మల్లికార్జునరావు, జాదవ్‌సుధాకర్‌రావు, లక్ష్మీనారాయణ, బచ్చువేణు ఉన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఎంపీపీపై ఫిర్యాదు



కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేస్తున్న రామారావు, మాల్యాద్రి తదితరులు

లింగసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేసిన అభివృద్ధి పనులు, చేయబోయే పనులను ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అడ్డుకుంటున్నారని టీడీపీ నేతలు పంకాయలపాటి మాల్యాద్రి, మద్దెల రామారావుతో పాటు మరికొందరు టీడీపీ నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు పాల్గొని మాట్లాడారు. 2023-24లో గత ప్రభుత్వంలో జరిగిన కొన్ని పనుల్లో అవకతవకలు జరిగాయని, పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారని వినతిలో పేర్కొన్నారు. వీరి వెంట టీడీపీ నాయకులు ఉన్నం వీరాస్వామి, అడపా రంగయ్య, అంగుళూరి చినకొండయ్య, పోలిమేర నాగిరెడ్డి, రాజారపు మాలకొండయ్య తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● షాలెట్, ఎంపీడీవో, సంగం



ఇంటర్వ్యూ

సంగం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో షాలెట్ పేర్కొన్నారు.

? మొదటి విడత పల్లెపండుగలో మండలానికి ఎన్ని నిధులొచ్చాయి.

! ఉపాధిహామీ నిధుల నుంచి మండలానికి రూ. 1.5 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో 18 గ్రామాల్లో 30పనులు (సీసీ రోడ్ల నిర్మాణం) చేపట్టాం.

? రెండోవిడత ఎన్ని కోట్లు మంజూరయ్యాయి.

! ఉపాధిహామీ పథకంలో రెండోవిడతలో మరో రూ.2కోట్లు మంజూరయ్యాయి. రూ.86లక్షలకు ప్రతిపాదన పంపాం. అనుమతులొచ్చాయి. మిగతా పనుల ప్రతిపాదనలు పంపాల్సి ఉంది.

? కార్పొరేషన్ల వారీగా మండలానికి రాయితీ రుణాలెన్ని వచ్చాయి.

! బీసీ కార్పొరేషన్‌లో 31, కాపు -4, రెడ్డి -3,కమ్మ, ఈబీసీ కార్పొరేషన్‌లో రెండేసి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య కార్పొరేషన్‌లో ఒక్కొక్కటి చొప్పున రాయితీ రుణాలొచ్చాయి.

? మండలంలో ఎన్ని చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయి.

! 20 పంచాయతీలకు గాను 10పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలున్నాయి. ఆయా పంచాయతీ నిధుల నుంచి చెత్త సేకరణకు ట్రైసైకిల్‌తోపా టు గ్రీన్ అంబాసిడర్లను నియమించి 15వ తేదీ నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలిస్తున్నాం.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలి

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్ర కారం వడ్డించాలని మండల విద్యాధికారి-2 ఆనందరావు తెలిపారు. సత్యవోలు, కొమ్మి ఎస్సీ కాలనీ, బోయళ్లవారిపాలెం ప్రాథమిక పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలి చ్చారు. విద్యార్థుల సమగ్ర వివరాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలి



వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన సర్పంచి కొండయ్య, నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు మండలం పరకండ్లపాడు దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలని గ్రామ సర్పంచ్ కోలా కొండయ్య, గ్రామస్థులు సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లుతో కలిసి గ్రీవెన్స్‌లో సబ్‌కలెక్టర్ శ్రీపూజకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాము, గారపాటి రామయ్య, శివ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

జీతాల కోసం ధర్నా

వింజమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చంద్రపడియ దగ్గర ఉన్న ఫ్యాక్టరీలో రెగ్యులర్ ఉద్యోగులకు రెండు నెలల నుంచి జీతాలు అందడంలేదని వారు సోమవారం ఫ్రాడ్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా నిర్వహించారు. జీతాలు చెల్లించిన అనంత రమే పనులకు వస్తామని నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఫ్యాక్టరీ హెచ్ఆర్ అజయ్ కుమార్ కార్మికుల దగ్గరకు వచ్చి వారంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

డీకేడబ్ల్యూలో ఫ్రింప్ పాప్ స్టార్టప్ ప్రారంభం



స్టార్టప్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ గిరి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రింప్‌పాప్ స్టార్టప్‌ను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీగిరి తెలిపారు. కళాశాలలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆక్వాకల్చర్ విభాగం, కోరమాండల్ కంపెనీ, ఆల్మామెరైన్ కంపెనీల భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు చేపలు, రొయ్యలు రెడీ టు ఈట్ ఉత్పత్తులను తయారు చేసి అందచేస్తారన్నారు. వారు తయారుచేసే ఉత్పత్తులను స్విగ్గీ, జొమోటోల ద్వారా నగర వాసులకు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆక్వాకల్చర్ విభాగాధిపతి టీ.శ్రీరంజని, కోరమాండల్ కంపెనీ జోన్ రీజనల్ మార్కెటింగ్ హెడ్ టీ.చక్ర ధర్, జోనల్ హెడ్ ఆర్‌సౌజన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

● నేడు జాబ్‌మేళా

డీకేడబ్ల్యు కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డి.గిరి తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. భవనాలు శిథిలం!

రోడ్లు భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకొంటున్నాయి. సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో కళావిహీనంగా మారుతోన్నాయి. సుమారు 125 ఏళ్ల చరిత్ర కలిగిన కోవూరు తహసీల్దారు కార్యాలయ భవన సముదాయం శిథిలమవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. 1903లో బ్రిటిష్ పాలనలో నిర్మించిన ఈ భవనంలో 1985 వరకు 83 రెవెన్యూ గ్రామాల ప్రజలకు సేవలందాయి. ఆ తరువాత ఏర్పడిన చిన్నచిన్న మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో భవనం పలుచోట్ల బీటలువారుతోంది. ఈ భవన సముదాయంలోనే ఉన్న సబ్‌ట్రెజరీ కార్యాలయం పైకప్పు ధ్వంసమైనా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పైకప్పు పలు చోట్ల ధ్వంసమైంది. విలువైన కలప కూడా ఎండకు ఎండి వానకు తడిసి పాడైంది. పైకప్పుపై పిచ్చిచెట్లు మొలుస్తున్నప్పటికీ సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులకు కన్పించకపోవడం గమనార్హం. తహసీల్దారు కార్యాలయ రికార్డు గది బీటలు వారుతున్నా మరమ్మతులు చేయకపోవడంతో శిథిల స్థితికి చేరుకొంది. రికార్డు గది అద్దాలు పగిలి, కిటికీలు ధ్వంసమయ్యాయి. పోలీస్‌స్టేషన్ భవనం వర్షాకాలంలో పూర్తిగా కురుస్తోంది. ఘన చరిత్ర కలిగిన భవనాలకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

- కోవూరు(ఆంధ్రజ్యోతి)



శిథిలమవుతోన్న తహసీల్దారు కార్యాలయం

న్యూస్ బాక్స్

నేడు జాబ్‌మేళా

కోవూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీహరిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్విని యోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వీసీని కలిసిన టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు

వెంటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీ అభివృది కి కృషి చేయాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ మండలా ధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి కోరారు. మండలంలోని వీఎస్‌యూ వీసీగా ఇటీవ ల బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును సోమవారం టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగు చ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం వర్సిటీలోని పలు సమ స్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీఎస్‌యూ అభివృద్ధికి కృషి చేస్తానని వీసీ భరోసా ఇచ్చారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

వెంకటాచలం): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ 1, 4వ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహ ణాధికారి వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 55 మంది హాజరయ్యారు.

యువ సమ్మేళనంలో నెల్లూరు యువత

నెల్లూరు(విద్య) : కేరళలోని ఎర్నాకులంలో నిర్వహించిన జాతీయ యువ సమ్మేళనానికి నెల్లూరువాసులు ఐదుగురు హాజరయ్యారని ఎన్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి తెలిపారు. నెహ్రూ యువకేంద్రం (ఎన్‌వైకే) కార్యాలయంలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీరంతా కేరళలోని పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సంస్కృతి, సంప్రదాయా లపై అవగాహన పెంచుకున్నారన్నారు. ఆరురోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో యువతకు వివిధ పోటీలను నిర్వహిం చారన్నారు. క్విజ్‌లో బీ.సతీష్ కుమార్ ప్రథమ, మురళీధర్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. షార్ట్‌ఫిల్మ్‌లో ప్రథమస్థానం, వంటల పోటీలో ద్వితీయ స్థానాన్ని సతీష్‌కుమార్, శరవణ, మురళీధర్, గోవింద, పెంచలసాయి సాధించారని ఆయన తెలిపారు.

డ్రోన్‌తో పరిసరాల పరిశీలన

నెల్లూరు(క్రైం) : చిన్నబజారు పోలీసు స్టేష న్ పరిధిలోని మూలాపేట, రాజీవ్ గృహక ల్ప, ఎస్-2 థియేటర్స్, చిన్నబజారు, పెద్దబ జారు ప్రాంతాలను సోమవారం ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలించారు. అనంతరం నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నేరాలు, అసాంఘి క కార్యక్రమాలు కట్టడిలో భాగంగా పోలీసు స్టేషన్‌లోని అన్నీ ప్రాంతాలను డ్రోన్ నిఘా నీడలోకి తీసుకువచ్చామని వివరించారు.

నేడు కుంభమేళా జలాల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం) : మిత్రమండలి సమన్వయంతో సేకరించిన కుంభమేళాలోని గంగాజలాన్ని మంగళవారం ప్రజలకు పంపిణీ చేయనున్నామని నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు సెంటర్‌లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు పంపిణీ చేస్తామన్నారు.

పీజీఆర్‌ఎస్ హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోండి

విడవలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు పొన్నలూరు పురందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు తహసీల్దారు చంద్రశేఖర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారులు హాజరుకాకపోవడంపై ఇప్పటికే పలుదఫాలు తహసీల్దారుకు ఫి ర్యాదు చేసినా అధికారుల్లో మార్పు రాలేద న్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

స్వచ్ఛంద నేత్రదానం

నెల్లూరు (వైద్యం) : తిప్పరాజువారివీధికి చెందిన సత్యనారాయణ (70) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు వినాకిని మాజీ అధ్యక్షుడు సునీల్‌బాబు సహకారంతో కుటుంబ సభ్యులు మృతుడి నేత్రాలను దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ ఆయన నేత్రాలను సేకరించారు. కాగా మృతుడి కుటుంబస భ్యులు తులసి తదితరులకు నేత్రదాన గుర్తింపు పత్రాన్ని వారు అందచేశారు.

సుందరేశ్వరాలయంలో అంకురార్పణ



సుందరేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణ పూజలు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దర్గామిట్ట రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అంకురార్పణ, రుద్రహోమం జరిగాయి. ఈ ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు రఘురామశర్మ, వేదపండితులు అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు. అలాగే నగరంలోని మూలాపేట అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారికి శేషవాహనసేవ జరిగింది. ఈ సందర్భంగా ఉదయం రుద్రహోమం, రుద్రాభిషేకాలు జరిగాయి.

● రేపు శివరాత్రి ఉత్సవం

నగరంలోని విరాట్‌నగర్‌లో ఉన్న శ్రీమద్‌పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు కందుకూరు చెంగయ్య ఆచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5గంటల నుంచి సుప్రభాత సేవ, అభిషేకాలు, పూలంగిసేవ, శివపార్వతుల కల్యాణం, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.



విద్యుద్దీపాలంకరణలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

ఇస్తిమా విజయవంతంపై హర్షం

కొడవలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రశేఖరపురంలో 2 రోజులపాటు జరిగిన తబ్లిక్ ఏ జమాత్ రాష్ట్రస్థాయి ఇస్తిమా విజయవంతంపై మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం చంద్రశేఖరపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జాకీర్ షరీఫ్ మాట్లాడుతూ ఈ పవిత్ర ప్రార్థనల్లో లక్షల మంది భక్తులు పాల్గొన్నారని తెలిపారు. భక్తులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు వాటర్ బాటిళ్లు, వాటర్ ట్యాంకులతో నీటి సరఫరా చేయించడమే కాకుండా ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేయడంతో ఇస్తిమా విజయవంతం అయిందని తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అలాగే మంత్రి నారాయణ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టీడీపీ నెల్లూరు నగర మైనారిటీ నాయకుడు ఇంతియాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సతీష్, నాగేశ్వరరావు, ముస్లిం మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (జడ్పీ),ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీవో ఆఫీసు, కబాడిపాళెం, రైల్వేస్టేషన్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

విడవలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని పార్లపల్లిలో సోమవారం టీడీపీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డితో కలసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచు రామిశెట్టి స్వాతి, వ్యవసా యశాఖ ఏవో కృష్ణయ్య, నాయకులు వేగూ రు చంద్రారెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, పూండ్ల యోసోబు తదితరులు పాల్గొన్నారు.

రేపు మహాదేవ యజ్ఞం

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం 4 నుంచి నగరంలోని పురమందిరం ఆధ్వర్యంలో మహాదేవ యజ్ఞం నిర్వహించనున్నట్లు కస్తూరివాస్తు నిర్వాహకుడు దువ్వూరి కస్తూరి, లీలామోహన్‌రెడ్డి, నిర్మలానరసింహారెడ్డి తెలిపారు. సోమవారం నిర్మల్‌సౌధాలో వారు విలేకరులతో మాట్లాడారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

మనుబోలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసింహపురంలో సాయి ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో ఐపీఎల్ కంపెనీ సౌజన్యంతో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రైతులకు 19వ దఫా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిందన్నారు. ఈకేవైసీ, ఈ-క్రాప్, యూనిక్ నంబర్ నమోదు వంటివాటిని ప్రతి రైతు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అవిచేస్తేనే పథకాలు, సబ్సిడీలు వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శివనాయక్, నర్సోజీరావు, శేషగిరిరావు, ఏవో జహీర్, ఐపీఎల్ కంపెనీ ప్రతినిధులు, సర్పంచు కడియాల సునీల్‌నాయుడు, సాయికుమార్ నాయుడు, రమణయ్య నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ

పొదలకూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సరస్వతీదేవి పూజ నిర్వహించి, విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులందరూ సత్ప్రవర్తనతో చదివి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విజ్ఞాన్ జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం వితరణగా అందించిన పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో సోమవారం సరస్వతీదేవి పూజా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మూలంరెడ్డి సుధాకర్, ప్రిన్సిపాల్ అన్నం సుబ్బారెడ్డి, జీఎస్.రెడ్డి పర్యవేక్షణలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి మండపంలో ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికెట్లు, పరీక్ష అట్టలు, విద్యాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.నారాయణరెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఏ.చంద్రశేఖర్‌యాదవ్, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బులు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యా సామగ్రి అందజేస్తున్న యాజమాన్యం

రద్దు అయిన టిడ్కో ఇళ్లు కొత్తవారికి...

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లు వద్దనుకున్న వారి ఇళ్లను కొత్తవారికి కేటాయించాలని ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. నగర వాసుల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు వద్దనుకున్నవారు లేఖ రాసి ఇవ్వాలని, దీంతో వారు చెల్లించిన మొత్తాన్ని అందచేసి, ఆ ఇంటిని కొత్తవారికి అప్పగించాలన్నారు. ప్రజల నుంచి ఎక్కువగా రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు వినతులు అందుతున్నాయని, వాటిని పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

విద్యార్థుల భవితకు క్రీడలు దోహదం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా వారి ఉజ్వల భవితకు దోహదం చేస్తాయని నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బసిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. నగరంలోని ధనలక్ష్మీపురం నారాయణ రెసిడెన్షియల్ స్కూల్‌లో సోమవారం క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా ప్రమాణాలను అందించడంతోపాటు వారిలోని క్రీడా, కళా ప్రతిభలను కూడా గుర్తించి ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల జీఎం వీ.విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగమణి, ఏజీఎం శ్రీనివాసులరెడ్డి, కో-ఆర్డినేటర్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అకౌంటెంట్ నిర్వచనంలో సీఎంఏలను చేర్చాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్నుబిల్లు-2025 సెక్షన్ 515(3)(బీ)లోని అకౌంటెంట్ నిర్వచనంలో కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్ (సీఎంఏ)ను చేర్చాలని సీఎంఏ వైస్‌చైర్మన్ వైశ్రీనివాసరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బృందావనంలోని నెల్లూరు చాప్టర్ కాస్ట్ అకౌంటెంట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు ఏఎంఏఐ, ఎస్ఐఆర్‌సీ, ఐసీఎంఏఐల తరఫున కేంద్ర ప్రభుత్వానికి మెమోరాండం ఇవ్వనున్నామని తెలియచేశారు. అకౌంటెంట్ నిర్వచనంలో కాస్ట్ అకౌంట్‌ను చేర్చాల్సిన అవసరాన్ని సూచించామన్నారు. సమావేశంలో నెల్లూరు సీఎంఏ చాప్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, నెల్లూరు సీఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గురుధ్యాన నిలయం ద్వితీయ వార్షికోత్సవం

వెంకటాచలం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడిలో ఉన్న గురుధ్యాన నిలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భగవాన్ వెంకయ్య స్వామి, దత్తాత్రేయులు, సాయిబాబాలకు అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుధ్యాన నిలయం నిర్వాహకుల పర్యవేక్షణలో భజనలు చేశారు.

చైర్మన్ టిడ్కో గృహాల సందర్శన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండల పరిధిలోని అక్కచెరువుపాడు టిడ్కో గృహాలను సోమవారం ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ సందర్శించారు. ఆ ఇళ్లలో నివాసం ఉంటున్న ప్రజలను పలకరించి, అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నీటి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని అధికారులకు సూచించామన్నారు. టిడ్కో కాలనీలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరక్కుండా చూడాలని, చౌకదుకాణం ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులను కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నూనె మల్లికార్జున, సుందరరామిరెడ్డి, గునుకుల కిషోర్, జమీర్, కారంపూడి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

శివరాత్రి ఉత్సవాలకు మంత్రి నారాయణకు ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలస్థానేశ్వర ఆలయంలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ సోమవారం పురపాలకశాఖామంత్రి పొంగూరు నారాయణకు ఆలయ ఈవో ఏవీ. శ్రీనివాసు రెడ్డి, వేదపండితులు, అర్చకులు ఆహ్వాన పత్రిక అందచేశారు. మంత్రి నివాసంలో ఈ మేరకు ఆహ్వానాన్ని అందించి, వేదాశీస్సులు పలికారు.



మంత్రి నారాయణను ఆహ్వానిస్తున్న అర్చకులు

ఫీజులు పెంచి, వసతులు కల్పించలేదు

● 'ప్రియదర్శిని' ఎదుట విద్యార్థుల ఆందోళన

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కళాశాలలో ఫీజులు పెంచి, వసతులు కల్పించలేదని నెల్లూరు రూరల్‌లోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల వద్ద సోమవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఫీజులను ఉన్నపళంగా రూ. 15 వేల నుంచి 20 వేల వరకు పెంచారని, చెల్లించని కారణంగా హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్యాకల్టీని ఎప్పటికప్పుడు మార్చేస్తున్నారని, ఇదేమని అడిగితే అది అంతేనంటూ చెప్తున్నారని ఆగ్రహించారు. హాస్టల్‌లో వసతులు ఏమీ బాగాలేవని, వాటిపై ప్రశ్నించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆందోళన సమాచారం అందుకున్న పలు విద్యార్థి సంఘాలు నాయకులు అక్కడకి చేరుకుని నిరసనలో పాల్గొన్నారు. దీంతో కళాశాల ప్రాంగణం వద్ద ఉద్రిక్తత నెలకొనగా, రూరల్ పోలీసులు రంగంలోకి దిగారు.



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

కార్పొరేషన్‌లో రుణ మేళా

● భారీగా తరలివచ్చిన నగర వాసులు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : కాపు సంక్షేమ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ఈబీసీ అర్హత కలిగిన వారికి సబ్సిడీ రుణాలు అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో అటు సిటీ, ఇటు రూరల్ నుంచి 6,683 మంది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. డివిజన్లవారీగా వీరందరికీ బ్యాంకు అధికారులు, కార్పొరేషన్ల యంత్రాంగంతో కలిసి సోమవారం ఎన్‌ఎంసీ కార్యాలయంలో రుణమేళా నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారితోపాటు సన్నిహితులు, కుటుంబ సభ్యులు భారీగా తరలిరావడంతో కార్పొరేషన్ కార్యాలయంలో రద్దీ నెలకొంది. ప్రక్రియను కమిషనర్ సూర్యతేజ, ఏడీసీ నందన్ పరిశీలించారు.

సరస్వతీ అలంకారంలో కల్యాణ వేంకటేశ్వరుడు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడు సరస్వతిదేవి అలంకారంలో హంసవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మట్టెంపాడులో ఆక్రమణలు తొలగించాలి : సీపీఎం

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడులో భూముల ఆక్రమణకు పాల్పడ్డ వారి నుంచి, వాటికి విముక్తి కల్పించాలని సీపీఎం జిల్లా నేతలు ఆలూరు తిరుపాలు, జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావమల్లు రమేష్ మట్టెంపాడులో 20 ఎకరాలు ఆక్రమించి దొంగపట్టాలు సృష్టించి, మామిడితోట సాగుచేస్తున్నారన్నారు. దీంతో పాటు రహదారిని ఆక్రమించి అతిథిగృహం నిర్మిస్తున్నారని ఆరోపించారు. వాటిని తొలగించాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు రమణయ్య, రవీంద్ర, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత విధానాలకు స్వస్తి పలకండి : కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో పాత విధానాలకు స్వస్తి పలకాలని దబ్బుగుంట కమిషనర్ బాలకృష్ణ సిబ్బందికి సూచించారు. సోమవారం వెట్ సోర్సింగ్ సిబ్బంది ఒకరు ఫాగింగ్, ఎక్స్‌కవేటర్, ఇతర వాహనాలకు డీజిల్ పేరుతో రాసిన రికార్డులు కమిషనర్ వద్ద తెచ్చి సంతకాలు చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన నగర పంచాయ తీ అధికారులు ఎక్కడికీ పారిపోరని, మీరు ఏప్పుడో జరిగినవి, మరో వారానికి జరగాల్సిన వాటి పేరుతో లెక్కలు రాసుకుని తీసుకు రావద్దని హెచ్చరించారు. అసలు ఇక్కడ ఏం జరిగిందో, జరుగుతుందో తెలియని పరస్థితులున్నాయని పేర్కొన్నారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతున్న సబ్సిడీ రుణాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజతో కలసి కమిషనర్ పరిశీలించారు.



దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ

కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు

నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ బాలకృష్ణను కౌన్సిలర్లు షాహుల్, ప్రమీలమ్మ, యానాదిరెడ్డి, షకీలా, జయంతి, అనంతమ్మ, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

వాహనాల విడిభాగాలు కావాలా నాయనా!

అయితే.. అటవీశాఖకు పోదాం రండి

ద్విచక్ర వాహనాల నుంచి లారీల వరకు అవసరమైన నాణ్యమైన విడి భాగాలు కావాలంటే స్పేర్‌పార్ట్స్ షాపులకు వెళ్లడం కన్నా తిరుపతి లోని అటవీ శాఖ కార్యాలయానికి వెళ్లడం మంచిదని వాహనదారులు భావిస్తున్నారట. ఇదేమిటనే అనుమానం మీకు రావచ్చు. కానీ, దీని వెనుక ఉన్న అసలు కథ ఏంటో తెలిస్తే ఆశ్చర్యపోతారు.

- తిరుపతి (మంగళం), ఆంధ్రజ్యోతి

ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకోవడంలో వీరోచితంగా వ్యవహరిస్తున్న అటవీ శాఖ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వాటిని మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. తాము దాడులు చేసి టన్నులకొద్దీ ఎర్రచందనం, భారీగా వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నామని చెబుతుంటారు. ఇందులో అత్యంత ఖరీదైన వాహనాలున్నాయని కూడా చెబుతారు. ఆ వాహనాలను కొంతకాలం తర్వాత అమ్ముదామంటే అవి తుక్కు కింద మాత్రమే పనికి వస్తున్నాయి. రూ.లక్షల విలువ చేసే వాహనాలు సైతం అమ్మకానికి పెడితే వేల రూపాయలు కూడా పలకడం లేదు. కారణమేమిటంటే వాహనాల్లోని ఖరీదైన, నాణ్యమైన విడిభాగాలు మాయమైపోవడమే.

చోరీకి కాదేదీ అనర్హం

అటవీ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకుంటున్న వాహనాలను కపిలతీర్థం వద్ద ఉన్న అటవీశాఖ కార్యాలయంలో ఉంచుతారు. పట్టుబడ్డ ఎర్రచందనాన్ని తిమ్మినాయుడుపాలెం వద్ద ఉన్న సెంట్రల్ గోడౌన్‌కు తరలిస్తారు. అయితే వాహనాలకు మాత్రం భద్రత లేకుండాపోతోంది. ఎవరైనా తమ వాహనాలకు కావాల్సిన విడిభాగాల కోసం వస్తే ఇక్కడున్న కొందరు కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది పట్టుబడ్డ వాహనం నుంచి ఊడబెరికి ఇచ్చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, లగేజ్ వాహనాలు, లారీలు ఇలా ఏది కావాలన్నా ఇక్కడ దొరుకుతున్నాయి. కొందరైతే ఏకంగా మెకానిక్‌ను తీసుకొచ్చి నాణ్యమైన పరికరాలను చూసి మరీ తీసుకెళుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. టైర్లు, రిమ్ములు, స్టీరింగ్ సిస్టం, ఇంజన్లో భాగాలు, బ్యాటరీలు, స్టీరింగ్ లాక్ సిస్టంలు చివరకు సీట్లను కూడా ఊడబెరికి అమ్ముకుంటున్నారు. ఇదిలావుండగా అటవీ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా పట్టుబడ్డ వాహనాల్లో ఖరీదైనవి, మంచి కండిషన్‌లో ఉన్నవి కనిపిస్తే అధికారులు వాటిపై ప్రభుత్వ వాహనం అని రాయించుకుని వాడేసుకుంటున్నారు.


విడిభాగాలు మారుస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

వేలంలో 153కు అమ్ముడుపోయింది 60

విడిభాగాలు ఊడబెరికిన ఫలితం ఈనెల 20న నిర్వహించిన వాహనాల వేలంలో కనిపించింది. కపిలతీర్థం వద్ద ఉన్న అటవీశాఖ కార్యాలయంలో 153 వివిధ వాహనాలను వేలానికి పెట్టగా 60 మాత్రమే అమ్ముడుపోయాయి. దీని వల్ల అటవీశాఖకు రూ.41,89,928 ఆదాయం చేకూరింది.

రూ.63,099 పలికిన బెంజ్‌కారు

మార్కెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ధర పలికే బెంజ్ కారును రూ.63,099కు వేలం పాటలో ఓ వ్యక్తి సొంతం చేసుకున్నాడు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ ఈ బెంజ్ కారు అటవీ శాఖ కార్యాలయానికి చేరుకున్న తర్వాత కేవలం రూ.63,099 పలికిందంటే దాని పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా, మొత్తం 60 వాహనాలు సైతం మార్కెట్ ధరలకంటే చాలా తక్కువకు పాటదారులు దక్కించుకున్నారు. ఇందుకు కారణం అందులోని విలువైన విడిభాగాలు తొలగించి వేయడమేనన్న విమర్శలున్నాయి.

ఆది నుంచి ఇదేతంతు

వాహన విడిభాగాల చోరీ, విక్రయాలు దశాబ్దాలుగా జరుగుతోంది. పట్టుబడిన సమయంలో వాహనాలు కండిషన్‌లో ఉన్నా కొంతకాలానికే తుక్కుగా కూడా పనికి రాకుండా చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది. తిరుపతి డివిజన్ పరిధిలో దాదాపు వెయ్యి వాహనాలు ఇలా మూలనపడి ఉన్నాయంటే అటవీ శాఖలో చేతివాటం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధిక ధరలు వేశారట

పట్టుబడ్డ ఎర్రచందనం వాహనాలకు రెవెన్యూ అధికారులు అధిక ధరలు నిర్ణయించడంతో బహిరంగ వేలంలో అమ్ముడు పోలేదని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. తక్కువ ధర నిర్ణయించి ఉంటే అన్నీ అమ్ముడు పోయేవని అంటున్నారు. మిగిలిన వాహనాలకు మరోసారి వేలం నిర్వహిస్తామన్నారు.

ఫిర్యాదును విచారిస్తున్న ఎస్పీ



పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న సీఐలు



మీ సమస్య ఎందుకు పరిష్కారం కాలేదంటే!

- పోలీస్ పీజీఆర్ఎస్‌లో వినతులపై కారణాల నమోదు తప్పనిసరి
- ఇద్దరు అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో 9 మంది సీఐల పరిశీలన
- అర్జీదారులను తిప్పించుకోకుండా ఎస్పీ చర్యలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయి? అవి పరిష్కారం అవుతాయా? కావంటే కారణాలు ఏంటి? ఎన్నేళ్లుగా ఆ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి? ఇలా ఆయా సమస్యలపై సీఐలు అధ్యయనం చేసి అర్జీలపై స్పష్టంగా నోట్ చేయాలి. నగం సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించేలా చొరవ చూపాలి. అర్జీదారుల్లో నమ్మకం, భరోసా కలిగించాలి. ఈ దిశగా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)'కు ఎస్పీ హర్షవర్ధనరాజు మార్పులు తీసుకొచ్చారు. గతానికి భిన్నంగా ఈ సోమవారం నుంచే అమలు చేశారు. ఈ కార్యక్రమం కోసం ప్రతి సబ్ డివిజన్ నుంచి ఒక సీఐ వంతున తొమ్మిది మందిని రప్పిస్తారు. ఒక సబ్ డివిజన్ పరిధిలో నలుగురు సీఐలు ఉంటే.. ఒక్కొక్కరు ఒక్కో సోమవారం వంతున వస్తారు. వీరంతా తమ సబ్ డివిజన్ల పరిధిలో నుంచి వచ్చే అర్జీదారులను కూర్చోపెట్టుకుని ఓపికగా వారి సాధక బాధలు వినాలి. వినతులను పరిశీలించి సాధ్యమైనంత వరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలోనే పరిష్కరించాలి. పరిష్కారం ఆలస్యమైనా.. ఒకవేళ సాధ్యం కాకున్నా అందుకు కారణాలను ఆయా వినతులపై నోట్ చేయాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలు జారీ చేశారు. ఇలా అర్జీదారులకు జవాబుదారీతనంగా ఉండేలా చేపట్టిన తొలి పీజీఆర్ఎస్‌కు అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు ఆధ్వర్యంలో సీఐలు శ్రీరాముడు (తిరుమల), సురేంద్రనాయుడు (పుత్తూరు), హుస్సేన్‌బాషా (వాకాడు), మురళీకృష్ణ (రేణిగుంట రూరల్), ఇమ్రాన్ బాషా (భాకరాపేట), శ్రీనివాసులు (శ్రీసిటీ), మురళీమోహన్ (తిరుపతి వెస్ట్), సంగమేశ్వరరావు (నాయుడుపేట రూరల్), సాదిక్‌ఆలీ (స్పెషల్ బ్రాంచి) పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 110 మంది నుంచి అర్జీలు తీసుకుని ప్రత్యేక కౌంటర్ ద్వారా వాటిని పరిశీలించి నెంబరు కేటాయించి ఆయా సబ్ డివిజన్ల సీఐల వద్దకు పంపారు. ఈ అర్జీల్లో ఎక్కువగా భూ సమస్యలు, భార్యాభర్తల వివాదాలు, కొట్లాటలు, పోలీసు స్టేషన్లకు వెళితే సరైన సమాధానం లేదని, సిబ్బంది కొందరు ప్రజల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని, ఆర్థిక లావాదేవీలు, ఆన్‌లైన్ సమస్యలు, సైబర్ క్రైం కేసులు వంటి వాటిపై ఎక్కువగా వచ్చాయి.

మార్పు ఎందుకంటే?

ఇప్పటి వరకు ఇద్దరు అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో ఒక సీఐ, ఒక ఎస్ఐ పాల్గొని పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలు స్వీకరించేవారు. వాటిని పరిశీలించి సంబంధిత డీఎస్పీలు, సీఐలకు పంపి పరిష్కరించాలని సూచించేవారు. అయినా, ఒక సమస్యపైనే కొందరు పది సార్లు ఎస్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆయా పోలీసు స్టేషన్లకు వీరి అర్జీలను పంపినా.. మళ్లీ వ్యయప్రయాసలకు ఓర్చి తిరుపతికి వస్తున్నారు. దీనిని గమనించిన ఎస్పీ హర్షవర్ధనరాజు.. పీజీఆర్ఎస్‌లో ఇచ్చే అర్జీలకు జవాబుదారీతనం కల్పించి.. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించి ప్రజల్లో పోలీసుశాఖ పట్ల నమ్మకం పెంచేలా ఈ మార్పును తీసుకొచ్చారు.

మా నగలు ఉన్నాయా?

బ్యాంకుకు ఖాతాదారుల పరుగు

30 మంది బాధితుల జాబితా ప్రదర్శన ● రికవరీకి హామీ


బ్యాంకు వద్ద ఖాతాదారులు

నాగలాపురం, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని యూనియన్ బ్యాంకుకు సోమవారం పలువురు ఖాతాదారులు క్యూ కట్టారు. తమ నగలు ఉన్నాయా అంటూ సిబ్బందిని ఆరా తీశారు. డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ చేతివాటం చూపి ఖాతాదారులకు సంబంధించిన 5,498 గ్రాముల బంగారు నగలను తీసుకెళ్లి బయట తనఖా పెట్టి రూ.2.35 కోట్లు తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై యూనియన్ బ్యాంకు తిరుపతి రీజనల్ డీజీఎం బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు బ్యాంకు మేనేజర్ తిరువరాజ్, డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్‌పై ఎస్ఐ సునీల్ శుక్రవారం కేసు నమోదు చేశారు. దీంతో గోల్డ్ లోన్ తీసుకున్న వారిలో ఆందోళన నెలకొంది. శని, ఆదివారాలు సెలవు కావడంతో.. సోమవారం ఖాతాదారులు బ్యాంకుకు వచ్చారు. కాగా, డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ 30 మంది ఖాతాదారుల నగలను బయట ప్రాంతాల్లో కుదువ అంగళ్లు, ఫైనాన్స్ సంస్థల్లో కుదువపెట్టినట్లు గుర్తించారు. ఈ 30 మంది ఖాతాదారుల జాబితాను అధికారులు బ్యాంకులో అతికించారు. వీరి నగలు రికవరీ చేసిచ్చేందుకు హామీ ఇచ్చారు. మరోవైపు మిగిలిన 36 మంది ఖాతాదారులు తమ నగలను విడిపించుకునేందుకు ఎగబడ్డారు.

సీఐ కార్యాలయాన్ని సంప్రదించండి

సత్యవేడు సీఐ మురళి సోమవారం బ్యాంకు అధికారులతో విచారణ కొనసాగించారు. ఘటనపై సిబ్బందిని, బ్యాంకు అధికారులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. 30 మంది జాబితాలోని ఖాతాదారులు బ్యాంకులో కుదువ పెట్టిన నగలకు సంబంధించిన రసీదులతో సత్యవేడు సీఐ కార్యాలయాన్ని సంప్రదించి విచారణకు సహకరించాలని ఆయన కోరారు. మరో రెండు మూడు రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని, నగల రికవరీకి కొంత వ్యవధి పడుతుందన్నారు.

అధికారులే బాధ్యత వహించాలి

నా కుటుంబ అవసరాల నిమిత్తం 2024 జూలై 26వ తేదీన 234 గ్రాముల బంగారు నగలను తాకట్టుపెట్టి రూ.3.9 లక్షల రుణం తీసుకున్నా. 30 మంది బాధిత ఖాతాదారుల జాబితాలో నా పేరూ ఉంది. నా నగలకు బ్యాంకు అధికారులే బాధ్యత వహించాలి.

- చిట్టిబాబు, నాగలాపురం

స్విమ్స్‌లో జీబీఎస్ అనుమానిత కేసులు

తిరుపతి(వైద్యం)/చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న జీబీఎస్ (గులియన్ బారే సిండ్రోమ్) వైరస్ సోకిందన్న అనుమానంతో 17మంది తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని స్విమ్స్ అధికారులు ధ్రువీకరించడం లేదు.జీబీఎస్ వైరస్ గురించి భయపడాల్సిన పనిలేదని వైద్యాధికారులు చెబుతున్నారు.ఇది అంటువ్యాధి కాదని, దీనికోసం స్విమ్స్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని తెలిపారు. చికిత్స పొందుతున్న వారిలో చిత్తూరు జిల్లా గంగవరం మండలానికి చెందిన 41ఏళ్ల వ్యక్తి, పలమనేరు మండలానికి చెందిన మహిళ వున్నారని సమాచారం. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిసింది.


దశకంఠుడిపై పరమశివుడి విహారం


రావణ, మయూర వాహనాలపై స్వామిఅమ్మవార్ల పురవిహారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గో రోజైన సోమవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు రావణవాహనంపై అధిరోహించి పురవిహారం చేశారు. ఆయన పక్కనే జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మయూర వాహనంపై ముందుకు సాగారు. అంతకుముందు అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు విశేష అలంకరణలు, పూజలు నిర్వహించారు. యాగశాల పూజలు జరిగాయి. ఉదయం బంగారు హంస వాహనంపై స్వామివారు, బంగారు యాళివాహనంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు ఊరేగారు. ఉదయం, రాత్రి స్వామి, అమ్మవార్ల ఊరేగింపును మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. వాహన సేవల ముందు కోలాట కళాకారుల నృత్యాలు, భక్తుల శంఖానాదం, శివనామస్మరణలు మార్మోగాయి. మాడవీధుల్లో ఉత్సవర్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు పలికారు. ఉభయదారులుగా కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన చిట్టాప్రగడ సీతారామాంజనేయులు కుటుంబ సభ్యులు.. జూలుగంటి సుబ్బారావు, నాగలక్ష్మి వ్యవహరించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు
- ఉదయం 9 గంటలకు: హంస-శుక వాహన సేవలు
- రాత్రి 8 గంటలకు: శేష-యాళి వాహన సేవలు

హంస, యాళివాహనాల్లో ఉత్సవర్లు



నేడు సారె సమర్పణ

స్వామి, అమ్మవార్లకు మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వం తరఫున సారె సమర్పించనున్నారు. మధ్యాహ్నం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలను తీసుకురానున్నారు.

మాల గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాల గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్వీయూ అసిస్టెంట్ ఇంజినీర్ వెంట్రపాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. తిరుపతిలో నిర్వహించిన మాల గెజిటెడ్ అధికారుల సంఘం రాయలసీమ స్థాయి సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మాల గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పదోన్నతుల్లో తగిన న్యాయం కోసం ప్రయత్నం చేస్తానన్నారు. శ్రీనివాసరావును ఏపీ మాల గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు జయరాం, దినకరమూర్తి, కృష్ణమూర్తి, మునెయ్య, శ్రీలక్ష్మి, గురుమూర్తి, మరియదాస్, దుర్గేష్ అభినందించారు.

నేటి నుంచి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ మంగళ, బుధ, గురువారాల్లో జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. భక్తుల రద్దీని అనుసరించి మంగళవారం 87, బుధవారం 209, గురువారం 140 అదనపు బస్సులు నడపనుంది. ఇందులో తిరుపతి, కోదూరు-తలకోన, గుడిమల్లం, శ్రీకాళహస్తి-తిరుపతి, నాయుడుపేట, గూడూరు, పిచ్చాటూరు, తడ, చెన్నై, గుడిమల్లం, పుత్తూరు-సదాశివకోన, కైలాసకోన, మూలకోన, ఊత్తుకోట-సదాశివకోన, వరదయ్యపాళెం-అవంతి, కోట, నాయుడుపేట-పంట్రంగం. పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, శ్రీశైలం, మదనపల్లెకు వెళ్లనున్నాయి. ఈ కారణంగా తిరుమల, కాణిపాకం, ఇతర ప్రదేశాలకు మూడు రోజుల పాటు బస్సుల కొరత ఏర్పడే అవకాశముంది.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 14 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

- శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.55 కోట్లు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,892
- తలనీలాలు సమర్పించినవారు: 25,930




పరమశివుడు ప్రతిష్ఠించిన యోగలింగం

● కైలాసనాథకోనలో హరోంహరా..



విశేష అలంకరణలో కైలాసనాథుడు



కైలాసనాథకోన జలపాతం



నారాయణవనం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి రమణీయత.. ఆధ్యాత్మికతల కలబోత కైలాసనాథకోన. ఉరికే జలపాతాలు.. ఎత్తయిన గిరులతో ఆహ్లాదకర వాతావరణం ఈ ప్రాంత ప్రత్యేకత. సాక్షాత్తూ పరమశివుడే ఇక్కడ అందాలకు ముగ్ధుడయ్యాడు. అందుకే ఇక్కడ కైలాసనాథుడిగా కొలువుదీరాడు. నారాయణవనం మండలం పాలమంగళం పంచాయతీ పరిధిలోని కైలాసనాథ కోనలో యోగలింగాన్ని దర్శించుకుని భక్తులు తాదాత్మ్యం చెందుతారు. హరుడి దర్శనం కోసం పరిసరాల నుంచే కాదు తమిళనాడు, కర్ణాటకల నుంచీ భక్తులు, పర్యటకులు వస్తుంటారు.

స్థల పురాణం

నారాయణవనంలో కల్యాణ వెంకన్న, పద్మావతీ దేవిల వివాహానికి ఆకాశరాజు పార్వతీ పరమేశ్వరులను ఆహ్వానించారని ఇతిహాస గాథ ప్రచారంలో ఉంది. ఆ క్రమంలోనే వచ్చిన శివపార్వతులు నయన మనోహరమైన కోన ప్రకృతిని చూసి ఆనందపరవశులయ్యారు. ఆ సమయంలోనే శంకరుడు యోగ లింగాన్ని ప్రతిష్ఠించాడని ప్రతీతి. ఈ విషయం తెలుసుకున్న అగస్త్య మహాముని కోనకు వచ్చి ఆరు మాసాలు తపస్సు చేశారని చెబుతారు. కల్యాణానంతరం వేంకటేశ్వరుడు లక్ష్మీ సమేతుడై వచ్చి పరమేశ్వరుడ్ని దర్శించుకుని అగస్త్య మహాముని ఆధ్వర్యంలో కామాక్షి అమ్మవారిని ప్రతిష్ఠించారంటారు. ఇది చాలా విశేషమైన ప్రదేశమని, పరమేశ్వరుడి జటాజూటం నుంచి గంగ జాలువారుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. స్వామికి కుడివైపు గంగాదేవి, ఎడమవైపు కామాక్షి దేవి కొలువుదీరి దర్శనమిస్తారు. కోనలో స్నానమాచరిస్తే కాశీలో పుణ్యస్నానం చేసినట్లు భావిస్తారు. వెంకట చలపతి మహత్యం పురాణంలో ఈ కోనశివుడి ప్రస్తావన ఉందని చెబుతారు.



కామాక్షి అమ్మవారు

భక్తుల తాకిడి

దేవదాయశాఖ పరిధిలోని కైలాసనాథకోన పర్యాటకులు, భక్తులతో సందడిగా ఉంటుంది. కార్తీక మాసంలో భక్తుల తాకిడి మరింత పెరుగుతుంది. ఈ పుణ్యతీర్థంలో స్నానమాచరించి, కైలాసనాథుడిని దర్శనం చేసుకుంటారు. కోనలో స్నానమాచరిస్తే సర్వపాపాలు హరించి, ముక్తి లభిస్తుందని నమ్ముతారు. అయ్యప్ప భక్తులు కూడా ఇక్కడ పుణ్యస్నానాలు చేసి మాలధరిస్తారు. శివరాత్రి సందర్భంగా ఇప్పటికే ఆధ్యాత్మిక సందడి ప్రారంభమైంది. బుధవారం వేడుక నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో కృష్ణనాయక్ తెలిపారు.

ఇలా చేరుకోవచ్చు..

పుత్తూరు నుంచి 13 కిలోమీటర్లు, నగరి నుంచి 20 కిలోమీటర్లు, తిరుపతి నుంచి 46 కిలోమీటర్లు, చిత్తూరు నుంచి 76 కిలోమీటర్లు ప్రయాణించి కైలాసకోన చేరుకోవచ్చు. పుత్తూరు బస్టాండు నుంచి రోజూ బస్సు సౌకర్యం ఉంది. నారాయణవనంలో దిగితే ఆటో, ఇతర వాహనాలుంటాయి. అటవీప్రాంతం కావడంతో రాత్రి వేళ ప్రయాణం క్షేమకరం కాదు. పర్యాటక శాఖకు చెందిన ఆరు, దేవదాయశాఖకు చెందిన మూడు అతిథిగృహాల్లో భక్తులు సేదతీరవచ్చు.




శ్రీమన్నారాయణుడి అభయం

సూర్య,చంద్రప్రభ వాహనాలపై దర్శనం



సూర్యప్రభ వాహనం



చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులను అనుగ్రహించారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక ఉత్సవమూర్తి ధన్వంతరి అలంకరణలో సూర్యప్రభ వాహనంపై, రాత్రి కృష్ణుడు అలంకరణలో చంద్రప్రభ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం రథోత్సవం జరగనుంది.





ప్రమాదం జరిగిన ప్రదేశంలో పోలీసులు, హైవే సిబ్బంది సహాయక చర్యలు - ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

టైరు పంక్చరవడంతో అదుపు తప్పి బస్సు బోల్తా

17 మందికి గాయాలు.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చుట్టూ చీకటి. నిద్రమత్తులో ప్రయాణికులు. ఒక్కకుదుపుతో బోల్తాపడిన బస్సు. ఏమైందో.. ఏం జరిగిందో తెలియక ఒకటే అరుపులు. ఇదీ సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పై ఆదివారం అర్ధరాత్రి దాటాక పరిస్థితి. పాండిచ్చేరి నుంచి విజయవాడకు ప్రయాణికులతో వస్తున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు ఆదివారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు క్రాస్‌రోడ్డు సమీపానికి వచ్చింది. ఆ సమయంలో టైరు పంక్చరు అయింది. వేగంగా వస్తున్న బస్సును డ్రైవరు అదుపు చేయలేకపోయారు. దీంతో హైవే రెయిలింగ్‌ను ఢీకొని దాదాపు 10 అడుగుల లోతులో బస్సు బోల్తాపడింది. ఎస్‌ఐ బ్రహ్మానాయుడు తన సిబ్బందితో అక్కడకు చేరుకొన్నారు. స్థానికుల సహకారంతో క్షతగాత్రులను బయటకు తీసి.. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో 34 మంది ప్రయాణికులు ఉండగా, 17 మందికి గాయాలయ్యాయి. వీరిలో బస్సు రెండో డ్రైవర్ సాయి సిద్దేష్, ప్రయాణికుడు ఎ.చందుకు తీవ్ర గాయాలై, పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నైకి తరలించారు. బస్సు ముందుభాగం నుంచి సగం వరకు నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదానికి కారణం అతివేగమేనని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడిన కార్మికుల బస్సు



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం సాధనవారిపాళెం వద్ద అపాచీ పరిశ్రమ బస్సు బోల్తా పడింది. బుచ్చినాయుడు కండ్రిగ నుంచి తడ మండలం మాంబట్టు వద్ద ఉన్న అపాచీ పరిశ్రమకు కార్మికులతో బస్సు బయలుదేరింది. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో బీఎన్‌కండ్రిగ- సూళ్లూరుపేట మార్గంలో సాధనవారిపాళెం సమీపంలో తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొందరిని 108 అంబులెన్స్‌లో బీఎన్‌కండ్రిగ ఆస్పత్రిలో చేర్పించగా మరో ఇద్దరిని సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపారు.

వంద పడకల 'ఈఎస్‌ఐ'

● హోదా పెంచుతూ జీవో జారీ

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని 50 పడకల ఈఎస్‌ఐ(కార్మిక శాఖ బీమా)కి వంద పడకల హోదా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. ఈఎస్‌ఐ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రికి తీర్చిదిద్దుతామని 15 ఏళ్లుగా ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా ఆ దిశగా ఏ ప్రభుత్వమూ చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతనెల 2న నిర్వహించిన క్యాబినేట్ సమావేశంలో తిరుపతి ఈఎస్‌ఐ ఆస్పత్రిని వంద పడకలకు పెంచుతూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా జీవో విడుదల చేసింది. అలాగే ఆస్పత్రిలో 26 మంది స్పెషలిస్టు డాక్టర్లను, 60 నర్సింగ్, పారామెడికల్, మరో 11 మంది కార్యాలయ సిబ్బందిని, 94 నర్సింగ్ ఆర్డర్లీ, స్వీపింగ్, సెక్యూరిటీ పోస్టులను కూడా భర్తీ చేసే విధంగా జీవోలో పొందుపరిచారు. వంద పడకల కల సాకారం కావడంపై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



ఈఎస్‌ఐ ఆస్పత్రి

అయ్యా! మా సమస్యలు పరిష్కరించండి

● కలెక్టరేట్‌కు క్యూ కట్టిన అర్జీదారులు
● పీజీఆర్‌ఎస్‌కు 241 వినతులు



కలెక్టరేట్‌లో రద్దీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'అయ్యా వారం వారం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. మాపై దృష్టిపెట్టి కనికరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు అర్జీదారులు పోటెత్తారు. 241 వినతులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు 164 వచ్చాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి..



మాది నిరుపేద కుటుంబం. భర్త చనిపోయాడు. వితంతు పింఛను కోసం కొన్నేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆరోగ్య సమస్యలున్నాయి. నెలసరి మందులు, వైద్య ఖర్చులకు డబ్బులు లేదు. పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి.

- అమీనాబీ, పుత్తూరు

నా ఆస్తి లాక్కుని వెళ్లగొట్టింది

నాకు పిల్లలు లేరు. బంధువు రమీజాబీ కుమార్తె హసీనాను దత్తత తీసుకుని పెంచి పెద్ద చేసి, చదివించాను. ఐదేళ్ల క్రితం నా భర్త అనారోగ్యంతో మరణించాడు. వృద్ధాప్యం కారణంగా హసీనా ఇంటికి వెళ్లాను. నా దగ్గర ఉన్న రూ.2లక్షల నగదు, భర్త ద్వారా నాకు సంక్రమించిన 10 తులాల బంగారం, నేను కాపురం ఉన్న (గొల్లవానికాలువ) ఇల్లు కూడా అప్పగించాను. కొన్ని రోజులు బాగానే చూసుకున్నా ఏడాదిగా చిత్ర హింసలకు గురిచేస్తోంది. తట్టుకోలేక గొల్లవాని కాలువలో ఉన్న నా ఇంటికి వచ్చేశాను. ఆ ఇంటిని అద్దెకు ఇచ్చేశారు. వారు ఖాళీ చేయడం లేదు. దయ ఉంచి నా కుమార్తె నుంచి నగదు, నగలు, ఇంటిని ఇప్పించి న్యాయం చేయండి.

- జమీలాబీ, గొల్లవానికాలువ, చంద్రగిరి



తాగునీటి బావిని కాపాడండి



సూళ్లూరుపేట మున్సిపాలిటీ కోళ్లమిట్టలోని ప్రభుత్వ భూమిలో బావి నిర్మించారు. చుట్టుపక్కల వారికి బాగా ఉపయోగపడుతోంది. ప్రస్తుతం కొందరు ఆ బావిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారు. బావిని కాపాడండి.

- సయ్యద్ మోని, సూళ్లూరుపేట

పట్టా భూమిలో రోడ్డు నిర్మిస్తున్నారు



కాలనీ రోడ్డుకు ఇచ్చిన భూమిలో అధికారులు ఎలాంటి నోటీసూ ఇవ్వకుండా సిమెంటు రోడ్డు వేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. పక్కన ఉన్న చెరువు, పంట కాలువలు, తూములు అన్యాక్రాంతం అయ్యాయి. మళ్లీ మా పట్టాభూమిలో చెరువుకట్ట ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. విచారించి న్యాయం చేయండి.

- మునిశేఖర్, తనియాలి, డీపీ సత్రం

స్థలం కబ్జాను అడ్డుకోండి

కలెక్టరేట్ పక్కనే 45 ఏళ్ల క్రితం ప్రభుత్వం తమ కోసం కేటాయించిన 4 ఎకరాల స్థలం కబ్జాకు గురవుతోందని, కాపాడాలని షికారీలు కోరారు. ఇళ్లు కట్టుకోకుండా ఖాళీగా వదిలేసిన స్థలంలో అర ఎకరా మేరకు తిరుచానూరుకు చెందిన బాబు గోడ కట్టాడని తెలిపారు. తొలగించమని పలుమార్లు కోరినా దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని వివరించారు. రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని షికారీకాలనీ వాసులు శంకర తదితరులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.



తిరుచానూరు షికారీ కాలనీవాసులు

చెరువు తూములో ఇరుక్కుని రైతు మృతి

రేణిగుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చెత్తా చెదారాలను తొలగించే క్రమంలో చెరువులో పడి తూములో ఇరుక్కుపోవడంతో రైతు మృతిచెందారు. ఈ ఘటన ఏర్పేడు మండలం రాజులపాళెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. రాజులపాళెం దళితవాడకు చెందిన రైతు ఎం.నడిపయ్య(50), మరో 14 మంది రైతులతో కలిసి సోమవారం ఉదయం సమీపంలోని చెరువు తూము నుంచి వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు వెళ్లారు. తూము కింది భాగంలో చెత్తచెదారాలను తొలగిస్తుండగా చెరువులో పడి గేటు వద్ద ఇరుక్కుపోయారు. అతడిని కాపాడేందుకు సహచర రైతులు ఎంత కృషి చేసినా ఫలితం లేకుండా పోయింది. అరగంట తర్వాత విగతజీవిగా తూము నుంచి కొట్టుకొచ్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ జయచంద్ర తెలిపారు.

పుట్ట నుంచి ఉద్భవించిన శివలింగం

వల్మీకి నాగేశ్వరాలయానికి విశిష్ట చరిత్ర



వల్మీకి నాగేశ్వరస్వామి ఆలయం

చిట్టమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల పరిధిలోని స్వర్ణముఖి నదీతీరాన ఉన్న గునపాడు గ్రామంలో వల్మీకి నాగేశ్వరస్వామి ఆలయానికి విశిష్ట చరిత్ర ఉంది. పూర్వీకుల నుంచి ప్రచారంలో ఉన్న కథనం ప్రకారం ప్రస్తుతం గునపాడుగా పిలవబడుతున్న నాటి గునుపేడు గ్రామ సమీపంలో పూర్వం ఒక గురుకులం ఉండేది. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పిల్లలు అక్కడ విద్యాభ్యాసం చేసేవారు. ఒక బాలుడు ఎంతో తెలివి తేటలు ప్రదర్శిస్తూ చదువు సంధ్యల్లో తోటి విద్యార్థుల కన్నా బాగా రాణించేవాడు. ఆ బాలుడు తెలివితేటలను గుర్తించిన గురువుకు అతడి తల్లిదండ్రులను చూడాలనిపించింది. తల్లిదండ్రులను గురుకులానికి తీసుకురావాలని పలుమార్లు చెప్పినా బాలుడు తీసుకురాలేదు. గురువుకు అనుమానం వచ్చి, ఆ బాలుడు ఎక్కడి నుంచి వస్తున్నాడు, అతడి తల్లిదండ్రులు ఎవరో తెలుసుకునేందుకు ఆ విద్యార్థిని వెంబడించారు. దట్టమైన అటవీ ప్రాంతంగా ఉన్న స్వర్ణముఖినది ఒడ్డుకు చేరుకున్న బాలుడు అక్కడున్న భారీ వృక్షం చుట్టూ తిరిగి సర్పాకారం పొంది పుట్టలోకి దూరడాన్ని గురువు గమనించాడు. ఈ విషయాన్ని మరుసటి రోజు ఆ గ్రామ పెద్దలకు తెలిపాడు. అక్కడేదో జరుగుతోందన్న అనుమానంతో గ్రామస్తులు గునపాలు తీసుకెళ్లి పుట్టను పెకలించేందుకు ఉపక్రమించారు. ఈ క్రమంలో పుట్ట నుంచి రక్తపు మరకలు రావడంతో పాటు శివలింగం కనిపించింది. దీంతో గ్రామస్తులు గునపాన్ని అక్కడే పడేసి వెళ్లిపోయారు. అదేరోజు రాత్రి గ్రామ పెద్దలకు శివుడు స్వప్నంలో కనిపించి గునపం వల్ల పేడు(బిల్ల) లేచిన శివలింగం ఉన్న చోట ఆలయాన్ని నిర్మించాలని, నిత్య పూజలు, నైవేద్యాలు ఇవ్వాలని సందేశాన్ని ఇచ్చినట్లు పూర్వీకుల కథనం. దీంతో శివలింగం లభ్యమైన చోట వల్మీకి నాగేశ్వరస్వామి పేరున శివాలయం నిర్మించబడింది. గునపం గాటుకి పేడు లేచిన శివలింగం చరిత్ర తెలియజేసేలా గ్రామానికి గునుపేడుగా నామకరణం చేయగా.. కాలక్రమంలో గునుపేడు గునపాడుగా మారింది. ఇప్పటికీ ఆలయంలోని శివలింగం మూలవిరాట్‌కు ఒక పక్కన పేడు లేచినట్లు దర్శనమివ్వడం ఇందుకు నిదర్శనమని గ్రామస్తులు చెబుతున్నారు. నాటి నుంచి నిత్య పూజలు చేస్తున్న వల్మీకి నాగేశ్వరస్వామి ఆలయంలో ఏటా మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు.

పోలీసు లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

చిట్టమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుదూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ పెళ్లకూరు భాస్కర్(42) అంత్యక్రియలు ఆయన స్వస్థలమైన ఈశ్వరవాక గ్రామంలో సోమవారం పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న భాస్కర్ ఆదివారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఈశ్వరవాక గ్రామానికి తరలించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి, రూరల్ సీఐ సంగమేశ్వరావు, నాయుడుపేట, చిట్టమూరు, ఓజిలి ఎస్ఐలు ఆదిలక్ష్మి, చిన్న బలరామయ్య, స్వప్న, సిబ్బంది ఈశ్వరవాకకు చేరుకొని భాస్కర్‌కు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రభుత్వ భూమిలో అర్ధరాత్రి గుడిసెల నిర్మాణం

అడ్డుకున్న అలిమిలి గ్రామస్తులు



అలిమిలి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ గోపి

బాలాయపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిమిలి పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 4లో భూమి వివాదాస్పదంగా మారింది. ఆదివారం అర్ధరాత్రి వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొందరు గుడిసెలు వేసేందుకు యత్నించగా అలిమిలి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తడంతో కొందరు 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపిచేశారు. సోమవారం ఉదయం ఎస్ఐ గోపి తన సిబ్బందితో వెళ్లి వివాదాస్పద భూమిని పరిశీలించి అలిమిలి గ్రామస్తులతో చర్చించారు. అటవీ, రెవెన్యూ శాఖల జాయింట్ సర్వే జరిగే వరకు ఇరు గ్రామాల ప్రజలు ఆ భూముల్లోకి వెళ్లద్దని సూచించారు. ఆయన వెంట ఫారెస్ట్ బీట్ అధికారి భవాని ఉన్నారు.

విద్యార్థులకు ఇంటి రుచులతో భోజనం పెట్టండి



వరసనాయుడుపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో జగదీష్ బాబు

దక్కిలి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇంటి రుచులతో రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో జగదీష్ బాబు నిర్వాహకులను కోరారు. సోమవారం ఆయన మండలంలోని వరసనాయుడుపల్లి, దక్కిలి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. నరసనాయుడుపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. దక్కిలి పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సరళ పాల్గొన్నారు.

తరగతుల విలీనాన్ని ఆపాలని నిరసన

కోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉన్న తమ పాఠశాలలోని 3,4,5 తరగతులను వేరే పాఠశాలలో విలీనం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని ఉత్తమ నెల్లూరు గ్రామస్తులు, పాఠశాల విద్యాకమిటీ సభ్యులు హెచ్చరించారు. ఉత్తమ నెల్లూరు పాఠశాలలోని 3,4,5 తరగతులను గమళ్లపాలెం పాఠశాలలో విలీనం చేయొద్దంటూ సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాకమిటీ చైర్మన్ పద్మజ ఆధ్వర్యంలో సభ్యులు రెవెన్యూ, మండల పరిషత్, విద్యాశాఖ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ జయజయరావు, ఎంపీడీవో గోపినాథ్, ఎంఈవో మస్తానయ్యకు వినతిపత్రాలు అందజేశారు.



ఎంఈవో మస్తానయ్యకు వినతిపత్రం అందజేస్తున్న విద్యాకమిటీ చైర్‌పర్సన్ పద్మ, ఉత్తమ నెల్లూరు గ్రామస్తులు

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు ఎడ్ల బండ్ల పందేలు

కోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు మనలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఒంగోలు జాతి ఎడ్ల బండ్ల పందేలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాల్లోని ఒంగోలు జాతి ఎడ్ల బండ్ల పందేలు జరుగుతాయన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు, ఐదో బహుమతి రూ.3 వేలు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

సౌన కాలువలు, చెరువుల మరమ్మతులకు రూ.16.23 కోట్లు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని సౌన కాలువలు, చెరువుల మరమ్మతులకు రూ.16.23 కోట్లు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలోని సౌన కాలువలు, చెరువుల మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. కూటమి ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలోని చెరువులు, సౌన కాలువల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు.

ఎన్నికల బిల్లులు చెల్లించండి

వెంకటగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా వీడియో చిత్రీకరణ కోసం పనిచేసిన తమకు బిల్లులు చెల్లించాలని ఫొటోగ్రాఫర్లు సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికలు జరిగి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.



వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి - రోగుల లేక ఖాళీగా ఉన్న వార్డు

రోగమేదైనా రెఫర్ చెయ్యడమే

- వెంకటగిరి సీహెచ్‌సీకి నిర్లక్ష్యపు జబ్బు
- కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిల్
- రక్త పరీక్షలూ అంతంత మాత్రమే
- ప్రైవేటు ఆస్పత్రులే జనానికి దిక్కు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 24: వెంకటగిరి పట్టణంలోని వంద పడకల ఆస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు పట్టుకుంది. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు పెద్దాస్పత్రి అయిన ఈ సీహెచ్‌సీకి రోజుకు 180నుంచి 210 మంది వరకు రోగులు వస్తుంటారు. అయితే సమస్య ఏదైనా నామమాత్రంగా చికిత్స అందించి రెఫర్ చేయడం ఇక్కడి వైద్యులకు అలవాటుగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఈ ఆస్పత్రిని 2001లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చి 30పడకలకు పెంచారు. ఆ ప్రకారం ఇక్కడ ఏడుగురు డాక్టర్లు విధుల్లో ఉండాలి. అయితే ప్రస్తుతం ఇద్దరు వైద్యులే ఉన్నారు. వారు రోజు మార్చి రోజు ఒకరు విధులకు వస్తున్నారు. రాత్రి పూట డాక్టరే అందుబాటులో ఉండడం లేదు. విధుల్లో ఉన్న వైద్యులూ చికిత్స అందించకుండా నామమాత్రంగా రోగులను పరిశీలించి జబ్బు ఏదో చెప్పకుండా తిరుపతికి వెళ్లాలని సూచిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రాత్రివేళల్లో ఏదైనా ప్రమాదం జరిగి ఆస్పత్రికి వస్తే ప్రథమ చికిత్స చేసి తిరుపతికి రెఫర్ చేసేయడం పరిపాటిగా మారింది. జనరల్ నర్సన్ లేకపోవడంతో చిన్నపాటి ఆపరేషన్ చేయించుకోవడానికి కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా గైనకాలజిస్టు లేకపోవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, గర్భిణులకు ప్రసవాలు చేయడంలేదు. ఇక డెంటిస్టు వారంలో మూడు రోజులు ఇక్కడ, మిగిలిన రోజుల్లో ఇతర పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఫిజియోథెరపిస్టు, ఎక్స్‌రే టెక్నీషియన్లు ఎప్పుడు విధుల్లో ఉంటారో తెలియదని రోగులు చెబుతున్నారు. రక్త పరీక్షలు పూర్తి స్థాయిలో చేయడం లేదు. కేవలం టైఫాయిడ్‌కు మాత్రమే నమూనాలు తీసుకుంటున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి పరీక్షలు చేయడానికి పరికరాలు లేవని, ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాలని సూచిస్తున్నారు. దీంతో రోగులు ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు హామీ కాగితాలకే పరిమితమైంది. వెంకటగిరి నుంచి రోజూ 60 మంది వరకు రోగులు డయాలసిస్ చేయించుకునేందుకు తిరుపతికి వెళ్లి వస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంకటగిరి సీహెచ్‌సీలో తగిన సంఖ్యలో వైద్యులను నియమించడంతో పాటు రోగులకు సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు



చెంగాళమ్మ ఆలయం వద్ద నుంచి పుట్టమట్టి తీసుకెళ్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీహరిరెడ్డి, రాము, శాంతి, రాజశేఖర్ తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ వద్దనున్న నాగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చెంగాళమ్మ ఆలయం వద్దనుంచి పుట్టమట్టి తెచ్చి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు చెంగాళమ్మ ఆలయం వద్దకు చేరుకొని అక్కడ్నీ పుట్టవద్ద ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పుట్టమట్టిని నాగేశ్వరస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చి పూజలు చేసి శివరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పాళ శ్రీహరిరెడ్డి, నలజాల రాము, ఎం.శాంతి, తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, చెన్నం శ్రీనివాసులు, పి.రాజశేఖర్, ఎం.సాయికిరణ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికులకు ఇక్కట్లు

తడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే పరిధిలో కవరైపేట - పొన్నేరి మధ్య జరుగుతున్న రైల్వే పనుల నేపథ్యంలో పలు రైళ్లు రద్దు కావడంతో జనం ఇక్కట్ల పాలయ్యారు. కవరైపేట - పొన్నేరి మధ్య చెన్నై వైపు వెళ్లే అప్‌లైన్‌లో ట్రాక్ మార్పిడి పనులు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 9.30నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలు రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. ముఖ్యంగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్లే మెమో రైళ్లు, చెన్నై - సూళ్లూరుపేట- చెన్నై సబర్బన్ రైళ్లను సాయంత్రం 4గంటల వరకు పూర్తిగా రద్దు చేశారు. అలాగే విజయవాడ - చెన్నై - విజయవాడ మధ్య నడిచే పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను గూడూరు నుంచి తిప్పి పంపారు. చెన్నై నుంచి నెల్లూరు వైపుగా వెళ్లే పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆలస్యంగా నడిపారు. సాయంత్రం 4గంటల తరువాత రాకపోకలను అనుమతి ఇచ్చారు.

ఐటీడీఏను ఏర్పాటు చేయండి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జునరావు సోమవారం జాయింట్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గిరిజన తెగల్లో అత్యధిక జనాభా కలిగిన యానాదులు తిరుపతి జిల్లాలో 10లక్షల మందికి పైగా ఉన్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్టీ వర్గీకరణ చేసి యానాదుల అభివృద్ధి తోడ్పాటును అందించాలని కోరారు. చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలోని యానాదులకు స్వయం ఉపాధి రుణాలు అందించి ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించాలని కోరారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు



పోస్టాఫీసు వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక పోస్టాఫీసు వద్ద మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆప్కాస్‌ను రద్దు చేయొద్దంటూ సీఎంకు పోస్టుకార్డులను పంపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తారని, సమానపనికి సమాన వేతనం చెల్లిస్తారని ఆశించడం జరిగిందన్నారు. ఇందుకు భిన్నంగా ఆప్కాస్‌ను రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, కోటేశ్వరరావు, సురేష్, బీవీ రమణయ్య, ప్రసాద్, వెంకటరమణయ్య, మణెమ్మ, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు నడిపితే చర్యలు



స్కూల్ బస్సును పరిశీలిస్తున్న ఎస్ఐ శివశంకర్

దక్కిలి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ పిల్లలను తీసుకెళ్లడానికి ఫిట్‌నెస్ లేని తిప్పితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శివశంకర్ హెచ్చరించారు. సోమవారం ఆయన దక్కిలిలో స్కూలు పిల్లలను తీసుకెళుతున్న బస్సులను తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ లేని బస్సులను తిప్పడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఫిట్‌నెస్ లేకుండా నడిపే బస్సులకు సీజ్ చేస్తామని, లైసెన్సు లేని డ్రైవర్లను అరెస్టు చేయడం జరుగుతుందన్నారు.

శ్మశాన వాటికకు రూ.రెండు లక్షల విరాళం



శ్మశాన వాటిక కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

నాయుడుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో వంటగది నిర్మాణానికి మాజీ కౌన్సిలర్ శేషం మునిగోపి, శేషం మునిమోహన రావు సోదరులు తమ తల్లిదండ్రులు కృష్ణమూర్తి, మస్తానమ్మ జ్ఞాపకార్థంగా రూ.రెండు లక్షల విరాళం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో శ్మశాన వాటిక కమిటీ సభ్యులు వసుపులేటి రాజాబాబు, దాసరి ప్రభాకర్ నాయుడు, మహేష్, దాము, జనార్దన యాదవ్, దువ్వూరు సుబ్రహ్మణ్యం రెడ్డి, ఉదయ్‌శంకర్, పాండు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన భూ సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం గ్రీవెన్స్‌లో వచ్చే భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామసభల్లో అందిన అర్జీలను ఆన్‌లైన్ చేయడంతో పాటు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పూజిత, సచివాలయ సర్వేయర్ లక్షణ్, వీఆర్వోలు తేజ, మోబీనా, వంశీకృష్ణ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో షంషాద్ బేగం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు కాన్వెంట్‌కు దీటుగా పనిచేస్తున్నాయని సీడీపీవో షంషాద్ బేగం అన్నారు. సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు సంరక్షణ, నూతన విద్యా విధానం, చిన్నారుల శారీరక, బాష, మేధోశక్తి కృత్యాలు తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో విద్యాబోధన

బాలాయపల్లి, ఫిబ్రవరి 24: అంగనవాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట పాటలతో విద్యాబోధన చేయాలని ఎంఈవో వెంకటేశ్వర్లు న్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగనవాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎంఈవో మాట్లాడుతూ పిల్లలకు ఒత్తిడి లేకుండా చదువుపై ఆసక్తి కలిగేలా ఆట విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో షంషాద్ బేగం, సీఆర్పీలు కొండూరు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ విద్యా బోధన అందించాలని ఎంఈవో శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జ్ఞానజోతి శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లకు బోధన విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో శీనయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అభివృద్ధి పనులపై ఎంపీడీవో గోపినాథ్ సమీక్షించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ వేణు పాల్గొన్నారు.

భక్తులు మెచ్చేలా మహాశివరాత్రి ఏర్పాట్లు



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్య నాయుడు, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి తదితరులు

దక్కిలి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో మహాశివరాత్రికి భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు తెలిపారు. సోమవారం ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఏర్పాట్లను ఎంపీడీవో గుణశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య నాయుడు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన భక్తులు స్వామి వారిని సులభంగా దర్శించుకొనేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఆలయం వెలుపల కోనేరు వద్ద అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

భట్లకనుపూరులో మహాశివరాత్రి ఉత్సవాలు

ఓజిలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లకనుపూరులో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సన్నద్ధమైంది. సోమవారం ఆలయం వద్ద ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు ఈవో రవికృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు గున్నం మధురెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు బచ్చల రవీంద్రారెడ్డి, పూజారి సత్యనారాయణ శాస్త్రి సమావేశమై ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను సమీక్షించారు. ఆలయం వద్ద చేపట్టాల్సిన పోలీసు బందోబస్తు గురించి నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు కమిటీ సభ్యులతో చర్చించారు. ఆయన వెంట ఎస్ఐ స్వప్న, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో...

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖి నది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణం చేశారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి తెలిపారు.

బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి



బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్‌తో పార్టీ నేతలు

గూడూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా స్థానిక పోటుపాలెం జాతీయ రహదారి కూడలి నుంచి పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అందరం ఐకమత్యంతో మెలుగుతూ, కలిసికట్టుగా పార్టీ పటిష్టతకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, దయాకర్, అరికట్ల బాలకృష్ణమనాయుడు, పనబాక కోటేశ్వరరావు, కోటారెడ్డి, శ్రీనివాసరావు, సురేష్‌బాబు, నరేంద్ర, మనోజ్‌కుమార్, ప్రకాష్‌నాయుడు, బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాజ్‌పేయి ప్రతిభా పురస్కారాలు

గూడూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అనంతరం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు వాజ్‌పేయి ప్రతిభా పురస్కారాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు విద్యార్థులకు వాజ్‌పేయి పేరుమీద ప్రతిభా పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరి బస్తాకు రూ.500 బోనస్ ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని 22గా నిర్ణయించాలన్నారు. ఇదే డిమాండ్‌తో మంగళవారం ఉదయం 10గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జగనన్న లే అవుట్‌లో అక్రమాలపై జేసీకి ఫిర్యాదు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న జగనన్న లే అవుట్‌లో అక్రమాలు జరిగాయని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య జాయింట్ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. లేఅవుట్‌లో 2511 ఇళ్లు మంజూరు అయ్యాయని, అయితే 2300 మందికి మాత్రమే పట్టాలు అందజేశారని తెలిపారు. మిగిలిన 211 ప్లాట్ల వివరాలు తెలియజేయడం లేదని, 150 ఇళ్లు పూర్తి చేసినట్లుగా లెక్కలు చూపించి హౌసింగ్ అధికారులు బిల్లులు స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు.